
ఈనాడు
ఆదివారం
19 అక్టోబరు 2025



దీపం... జ్ఞానరూపం!

జర్నలిస్టుగా పనిచేశాను

రోష్నీ నాడార్... హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్ వారసురాలిగానే వాణిజ్యరంగంలో అడుగుపెట్టారు. అయితేనేం, తనదైన వైవిధ్యంతో సంస్థని ప్రపంచవ్యాప్తంగా విస్తరించి... ఇటీవల హురూన్ భారతీయ సంపన్నుల జాబితాలో అతిపిన్నవయస్కురాలిగా మూడోస్థానం అందుకున్నారు. స్కైడైవింగ్ అంటే తనకి చాలా ఇష్టమనే రోష్నీ... తాను బిజినెస్ రంగంలోకి రావడం కూడా అచ్చం స్కైడైవింగ్‌లాగే జరిగిందంటారు. ఆమె పంచుకున్న ముచ్చట్లివి...



సాహసాలు చేస్తుంటా...

సాహస యాత్రలంటే ఇష్టం. న్యూజిలాండ్ నార్త్ ఐస్‌ల్యాండ్‌లో ఇదివరకే స్కైవాక్ చేశాను. ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్ బ్రిడ్జిని కాలినడకతో ఎక్కాను. అప్పుడప్పుడూ ఆఫ్రికా సఫారీకి వెళ్తొస్తుంటాను.

ఆ స్వేచ్ఛే..!

చదువులో నేను యావరేజి స్టూడెంట్‌నే. నేను ర్యాంకు తెచ్చుకుని తీరాలని అమ్మానాన్నలు ఎప్పుడూ ఒత్తిడి చేయలేదు. హెచ్‌సీఎల్ సంస్థకి ఉపయోగ పడుతుంది కాబట్టి... నువ్వు ఇంజినీరింగే చేయాలనీ ఎప్పుడూ చెప్పలేదు. మీడియా రంగంలోకి వెళతానన్నా 'సరే' అన్నారు. వాళ్లు ఆ స్వేచ్ఛే ఇవ్వకుంటే... నాకు ప్రపంచం ఇంతగా అర్థమై ఉండేది కాదు.



అలా అడిగేశాను...!

అమెరికాలోని కెలాగ్స్ కాలేజీలో ఎంబీఏలో చేరిన మొదటి రోజది. నా తోటి విద్యార్థులందరూ బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లుగా ఢక్కామొక్కీలు తిని వచ్చినవాళ్లు... నాకు ఆ రంగమే కొత్త. అప్పుడో ప్రొఫెసర్ వచ్చి 'మీలో ఎంతమంది 'ఎక్సెల్ షీట్'ని వాడుతున్నారు...' అని అడిగితే, అందరూ చేతులెత్తారు నేను తప్ప! 'నీకు అది కూడా తెలియదా?' అని ఆ ప్రొఫెసర్ అంటే 'మీకు వీడియో కెమెరా పట్టుకోవడం వచ్చా... నాకొచ్చు. నేను జర్నలిస్టుని' అన్నాను. క్లాసంతా గొల్లుమంది. అలా మొదలైతేనేం, ఎంబీఏలో బెస్ట్ స్టూడెంట్‌గానే బయటకొచ్చాను!

ఇప్పటికీ జర్నలిస్టునే...

అమెరికాలో 'రేడియో టీవీ కమ్యూనికేషన్'లో డిగ్రీ చేశాన్నేను. 'సీఎన్‌బీసీ' టీవీ సంస్థలోనూ, మనదేశంలోని 'సీఎన్ఎన్'లోనూ, లండన్ 'స్కై టీవీ'లోనూ మూడేళ్లు పనిచేశాను. మా నాన్న కోరిక మీద ఎంబీఏ ముగించి అనుకోకుండానే హెచ్‌సీఎల్ సంస్థలోకి అడుగుపెట్టాను. కంపెనీలో ఎదుగుతూ ఉన్నా సరే... జర్నలిజంపైన నా మమకారం పోలేదు. అప్పుడప్పుడూ కొన్ని న్యూస్ స్టోరీస్ చేసి... యానిమల్ ప్లానెట్, నేషనల్ జియోగ్రఫీ ఛానెల్స్‌కి పంపిస్తుంటాను!

బ్యాలన్స్ కాదు... ఛాయిస్!

'వర్క్ లైఫ్ బ్యాలన్స్' అన్న మాటని నేను నమ్మను. బదులుగా 'వర్క్-లైఫ్ ఛాయిస్' అంటాను. మహిళగా కొన్నిసార్లు నేను పనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సి రావొచ్చు, కొన్నిసార్లు కుటుంబంవైపు మొగ్గాలి రావొచ్చు. దేనికి ఎప్పుడు ప్రాధాన్యం ఇవ్వాలన్నది మన ఛాయిస్! ఒక్కసారంటూ ఆ నిర్ణయం తీసుకున్నాక బాధపడ కూడదన్నది నేను పాటించే సూత్రం.

డబ్బు... అందుకే!

ఎంత డబ్బు సంపాదించినా సేవతోనే దానికి సార్థకతని నమ్ముతాను. అందువల్లే 'విద్యాజ్ఞాన్' పేరుతో పేదపిల్లల కోసం అతిపెద్ద రెసిడెన్షియల్ స్కూళ్లని మేం నడుపుతున్నాం. ఆ స్కూళ్ల ద్వారా ఓ పేదింటి నుంచి భవిష్యత్తు ప్రధాని ఒకరు వస్తే... చూడాలన్నది నా కోరిక!



పిల్లలూ... నేనూ...

మా పెద్దవాడు అర్మాన్ కడుపులో పడ్డప్పుడే... హెచ్‌సీఎల్‌లో నా బాధ్యతలు పెరిగాయి. అందువల్ల కాన్పు తర్వాత పెద్దగా సెలవులు తీసుకోకుండానే పనిలో పడ్డాను. రెండోవాడు జహాన్ పుట్టినప్పుడూ అంతే. పెద్దవాడికి ఇప్పుడు పన్నెండేళ్లు వచ్చాయి... రెండోవాడికి తొమ్మిదేళ్లు. ఓ బిజినెస్ లీడర్‌గా నా పని వత్తిడి ఎలాంటిదో ఇద్దరికీ బాగా తెలుసు... కాబట్టి అమ్మ కొంగు చాటున కాకుండా స్వతంత్రంగా ఎదగటం నేర్చుకున్నారు. నేనూ ఒకప్పుడు అలా పెరిగినదాన్నే మరి!

ప్రేమ... పెళ్లి!

ఇండియాకి వచ్చి మా హెచ్‌సీఎల్ సంస్థలో ఇంటర్న్‌గా చేరి... బిజినెస్ గురించి నేర్చుకుంటూ ఉన్నప్పుడే శిఖర్ మల్హోత్రా పరిచయమయ్యాడు. తను కువైట్‌లో పుట్టిపెరిగాడు... వ్యాపార కుటుంబమే అయినా హోండా సంస్థలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఏడేళ్ల స్నేహం తర్వాత... 2010లో మేం పెళ్లి చేసుకున్నాం.



అదో తీరని కల...

చిన్నప్పుడే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. దాంతోపాటూ పియానో అభ్యసించాలనీ, మా నాన్న మాతృభాషైన తమిళం నేర్చుకోవాలనీ... కలలు ఉన్నాయి కానీ సమయం చాలట్లేదు!

లోపల

మంచిమాట

మిమ్మల్ని ప్రతిదానికీ పొగిడేవాడు మీకో రహస్య శత్రువని గ్రహించాలి.

మీకు తెలుసా!

ఇస్వాతిని... ఓ ఆఫ్రికా దేశం. హ్యారీపోటర్‌లా కొందరు మంత్రగాళ్లు చీపురుకట్ట సాయంతో ఎగురుతారన్నది స్థానికుల నమ్మకం. అందుకే- 2013లో 'దేశ గగనతలంలో 493 అడుగులకంటే ఎత్తున ఏ ఎయిర్‌క్రాఫ్ట్‌లూ, డ్రోన్‌లూ, వాటితోపాటూ చీపురుకట్టలూ ఎగరకూడదు' అంటూ ఓ చట్టం తెచ్చింది అక్కడి ప్రభుత్వం.

మన సామెత

గారాబం గజ్జెల కోసం ఏడిస్తే, వీపు దెబ్బల కోసం ఏడ్చిందట.



ఆ రైతుల ఆస్తులు రూ.350 కోట్లు!

పంట వేయాలంటే అప్పు ఎవరు ఇస్తారా, అని సగటు రైతులా ఎదురుచూడాల్సిన బాధలేదు. ఇంట్లో పెళ్లి పెట్టుకుంటే 'మేమున్నాంగా' అని భరోసా ఇచ్చే తోటి రైతులు ఉన్నారు. పెద్ద వయసులో కంటి సమస్యలొస్తే ఉచిత వైద్యం, పింఛన్లూ ఉన్నాయి. ఇవి కాక పెట్టుబడుల నుంచి ఏటా లాభాలు. ఇవన్నీ వింటుంటే మీకూ ఆ రైతు బంగారులోకం ఎక్కడో తెలుసుకోవాలని ఉంది కదా! మరెక్కడో కాదు, హనుమకొండ జిల్లాలోని ములుకనూర్ రైతుల విజయగాథ ఇది...





ములుకనూర్ రైతు సంఘం విజయం చిన్నదేం కాదు. ఏడువేలమంది రైతులుండే ఈ సంఘం ఆస్తుల విలువే రూ.350కోట్లు. వ్యవసాయం అంటే అప్పులూ, కష్టాలూ, ఆత్మహత్యల గురించే తెలిసిన మనకు ఈ రైతు సంఘం సాధించిన విజయం ఆశ్చర్యాన్నే కాదు, స్ఫూర్తినీ రగిలిస్తుంది. అయితే ఈ విజయం వెనుక 70 ఏళ్లనాటి రైతుల కన్నీళ్లు దాగి ఉన్నాయి. ఆ కష్టాలనీ, కన్నీళ్లనీ దాటడానికి ఆ రైతన్నలు చేసిన కృషే నేటి ఈ విజయానికి కారణం. ఇప్పుడు లాభాలు తెచ్చిపెడుతున్న ఈ ప్రాంతం 70 ఏళ్ల క్రితం... కరవూ, కాటకాలతో సతమతమైంది. సాగు చేయడానికి చేతిలో చిల్లిగవ్వలేక, అప్పటికే వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక రైతులు ఎన్నో పాట్లు పడ్డారు. ఒకవేళ ఎవరైనా పంట వేస్తే- గిట్టుబాటు ధర వచ్చేది కాదు. అన్నం పెట్టే రైతే ఆకలితో అలమటించిన దుస్థితి. ఇదే కొనసాగితే బిడ్డల భవిష్యత్తు ఊహించలేము అనుకున్న... విశ్వనాథరెడ్డి, భూపతి కృష్ణమూర్తి, పడాల చంద్రయ్యతోపాటు మరో 373మంది రైతులు ఏకమై రెండువేల ఐదొందల రూపాయలతో ఈ ములుకనూర్ సంఘానికి పునాది వేశారు. అలా 1956 జులైలో 'ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం' ఏర్పడింది. ఆ రోజు వాళ్లు చేసిన ఆ చిన్న పొదుపే ప్రస్తుతం కోట్ల వ్యాపారమై ఎక్కడాలేని విధంగా రైతులకు అండగా ఉంటోంది.

పునాది ఇలా...

వందకి వంద వడ్డీ తీసుకునే ఆ రోజుల్లో ఆ భారాన్ని తగ్గించడమే మొదటి లక్ష్యంగా పెట్టుకుందీ రైతు సంఘం. జమ చేసిన డబ్బుల్లోంచి కొంత- సభ్యులకు తక్కువ వడ్డీతో అప్పులు ఇస్తే, మిగిలిన డబ్బుతో రైతుల అవసరాల్ని తీరుస్తూ రకరకాల వ్యాపారాల్లోకి అడుగుపెట్టింది. రైసుమిల్లూ, ఎరువులు-విత్తనాల సూపర్ మార్కెట్లూ, వ్యవసాయ యంత్రాల దుకాణాలూ, విద్యుత్తు మోటర్ల షాపులూ, విత్తన శుద్ధి కేంద్రాల్లాంటివి ప్రారంభించింది. అలా ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒకవైపు వ్యాపారాల్లో మంచి లాభాలు అందుకుంటూ మరోవైపు రైతన్నకు అండగా నిలుస్తూ వచ్చింది. రైతుల సమష్టి కృషితో ఆ ఊరి ముఖ చిత్రమే మారుతూ వచ్చింది. నెమ్మదిగా పక్కనున్న 14 గ్రామాల రైతులూ చేరారు. వాళ్లందరూ సంఘం ద్వారా సాగుబడికి కావాల్సిన రుణాలే కాదు, వ్యవసాయ పరికరాల్ని కొనడానికీ డబ్బు సాయం తీసుకోవచ్చు. ఇంకా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందివ్వడం దగ్గర్నుంచి పంట అమ్మడం వరకూ అన్నీ సంఘం ఆధ్వర్యంలోనే జరుగుతాయి. ప్రస్తుతం సంఘం సభ్యుల సంఖ్య 7540కి చేరింది. రైతుల జమ డబ్బులు రూ.49 కోట్లు అయింది. సంఘం మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ. 350 కోట్లకు చేరింది ఇప్పుడు. ఈ ఒక్క ఏడాదే రూ.407 కోట్ల వ్యాపారం చేస్తే ఏడు కోట్ల రూపాయల లాభాలు వచ్చాయట. అందులోంచి రూ. నాలుగు కోట్లను సభ్యులందరికీ బోనస్‌గా పంచారట.



ఏమేం చేస్తుంటారు...

భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా విడిగా సంక్షేమ నిధినీ పెట్టుకుంది ఈ రైతు సంఘం. సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాల ఖర్చులకు డబ్బు ఇస్తూనే వాళ్లకు బీమా, అప్పు పథకాల్ని వర్తింపజేస్తుంది. చనిపోయిన సభ్యులకు సంక్షేమ డిపాజిట్ల ఆధారంగా ఎక్కువ వడ్డీ డబ్బులు ఇస్తూ, తీసుకున్న అప్పు మాఫీ చేస్తుంది. 65 ఏళ్లు నిండిన అన్నదాతలకు నెలకు రూ.వెయ్యి పింఛన్ ఇస్తోంది. సభ్యులతోపాటు వారి భాగస్వామికీ ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయిస్తుంది. ఇంకా విద్యార్థులకు ఏటా రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాలు ఇస్తోంది. వ్యవసాయానికే కాకుండా పెళ్లికీ, పిల్లల చదువులకూ, వైద్యానికీ తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తోంది. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులందరూ ఉచితంగా చదువుకునేలా సొంత నిధులతో ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలల్నీ ఏర్పాటు చేసింది. ప్రతి రెండున్నర ఏళ్లకోసారి పాలకసంఘాన్ని ఎంపిక చేసుకుంటూ, ప్రత్యేకంగా ఉద్యోగుల్ని నియమించుకుని కార్యకలాపాలన్నింటినీ సజావుగా జరుపుకుంటోందీ రైతు సంఘం!

– బుర్ర స్వామిగౌడ్, న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

కార్తికం విశిష్టత ఏమిటి?

పరమేశ్వరుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే మాసం కార్తికం. ఈ సమయంలో చేసే తులసిపూజ, దీపారాధన, ఉపవాస దీక్ష... తదితర అంశాల విషయంలో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుందామా...



◆ మిగిలిన రోజులతో పోలిస్తే ఈ మాసంలో వెలిగించే దీపాలకు ఏదైనా విశిష్టత ఉందా? అలాగే ఆకాశదీపం వెనుక ఉన్న పరమార్థం ఏమిటి?

☛ ఈ సమయంలో సూర్యుడు తుల-వృశ్చిక రాశుల్లో సంచరిస్తే చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు. దాంతో కార్తికంలో సూర్యకాంతి తగ్గడమే కాకుండా చీకటీ దట్టంగా ఉంటుంది. సూర్యాస్తమయం త్వరగా అవుతుంది. మన శరీరమూ శక్తిని పుంజుకోలేక నీరసపడుతుంది. ఆ శక్తిని ఉత్తేజితం చేయడంతో పాటు చిమ్మచీకట్లను పారదోలడం కోసమే దీపాలను వెలిగిస్తాం. అది కూడా ఉదయం నెయ్యితో, సాయంత్రం నువ్వులనూనెతో వెలిగించాలి. ఇక, ప్రమిదలో రెండు వత్తులు శాంతిని ప్రసాదిస్తే... మూడు ధనవృద్ధినీ, నాలుగు ఐశ్వర్యాన్నీ, అయిదు అఖండ సంపదల్నీ ఏడు మోక్షాన్నీ ప్రసాదిస్తాయి. మనలో ఉండే పంచతత్వాలకు ప్రతీకగా అయిదు రుచులతో ఉండే ఉసిరికాయపైనా దీపాన్ని వెలిగించొచ్చు. తులసికోట పక్కన పొడవైన కొయ్యదీపస్తంభాన్ని ఏర్పాటు చేసి కొయ్యపలకపైన వెలిగించే దీపాన్నే 'ఆకాశదీపం' అంటారు. దీన్ని వెలిగించడం వల్ల జ్ఞానం సిద్ధిస్తుంది. దేహంపైన మమకారం తగ్గించుకుని జీవుని ఉనికిని తెలుసుకునే ప్రయత్నంలో భాగంగానే ఆకాశదీపాన్ని వెలిగిస్తారు.

◆ శివుడిని పూజించే ఈ మాసంలో విష్ణుమూర్తికీ ప్రాధాన్యం ఇస్తారెందుకు?

☛ 'శివాయ విష్ణురూపాయ' అంటారు. కార్తికానికి హరిహరుల మాసమని పేరు. ఈ నెలలో వచ్చే చతుర్దశి తిథిని వైకుంఠ చతుర్దశిగా పిలుస్తారు. ఆరోజున శ్రీమన్నారాయణుడు వైకుంఠాన్ని వీడి, వారణాసికి చేరుకుని కాశీ విశ్వనాథుడిని అర్చిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. విష్ణుమూర్తి రామావతారం దాల్చినప్పుడు పరమేశ్వరుడే ఆంజనేయుడిగా అవతరించి, రావణసంహారంలో తన వంతు సహకారాన్ని అందించాడు. హరిహరులిద్దరూ కలిసి జలంధరుడిని అంతం చేశారు. కాబట్టి శివభక్తి గొప్పదా, విష్ణుభక్తి గొప్పదా అనే చర్చకు తావివ్వకుండా ఇరువురినీ కలిపి ఈ మాసంలో పూజించాలని అంటారు. ఆ అద్వైతతత్వాన్ని లోకానికి వివరించే ప్రచారంలో భాగంగానే ఈ నెలలో హరిహరసుతుడైన అయ్యప్పను కూడా విశేషంగా పూజిస్తారు.





గురుముఖం

◆ కార్తికంలో ఉపవాసం చేయాలని అంటారు కదా. ఇప్పుడున్న బిజీ జీవనవిధానంలో రోజంతా ఉపవాసదీక్షను అనుసరించడం ఎలా?

☛ సాధారణంగా ఈ సమయంలో చాలామంది రోజంతా ఉపవాసం ఉండి, సూర్యాస్తమయం తర్వాత భోజనం చేస్తుంటారు. అది సాధ్యం కాదనుకుంటే పరమాత్ముడిపైన మనసును లగ్నం చేస్తూ వీలైనంతవరకూ మితంగా ఆహారాన్ని స్వీకరించొచ్చు. లేదంటే... వాయుపురాణంలో పేర్కొన్నట్లుగా పెసరపప్పు-బియ్యం కలిపి గంజి వార్చకుండా వండుకుని మొదటిసారి ఎంత వడ్డించుకుంటామో అంతే- అంటే, మారు వడ్డించుకోకుండా భుజించడం వల్ల ఎలాంటి దోషం ఉండదు. అలాగే, సహజంగా లభించే ఫలాలు, నువ్వులు-బెల్లం కలిపి చేసిన ఉండలు, తేనె-నెయ్యి-పాలు-పెరుగు-పంచదారతో చేసిన పంచామృతం, తులసినీరు వంటివి స్వీకరించొచ్చు. అయితే, ఏదయినా పదేపదే కాకుండా ఒకసారి మాత్రమే స్వీకరించడం ఉత్తమం.

◆ తులసిపూజకు కార్తికంలోనే ఎందుకు అంత ప్రాధాన్యం ఇస్తాం?

☛ తులసి అంటే వెలకట్టలేనిది అని అర్థం. తులసి పూర్వ నామం వృంద. జలంధరుడి ఇల్లాలు. ఆమె పాతివ్రత్యం కారణంగానే జలంధరుడు మరణం లేకుండా వరం పొంది, ఆ గర్వంతో విర్రవీగాడు. దాంతో హరిహరులిద్దరూ అతడిని సంహరించే క్రమంలో... విష్ణువు జలంధరుడి రూపాన్ని దాల్చి వృంద సమీపానికి వెళ్లడంతో, పాదప్రక్షాళన నిమిత్తం ఆ ఇల్లాలు నీళ్లు అందించిందట. దీంతో ఆమె పాతివ్రత్యం భంగంకావడంతో పరమేశ్వరుడు త్రిశూలంతో జలంధరుడిని అంతమొందించాడు. అది తెలిసి వృంద తన దేహాన్ని యోగాగ్నికి అర్పించింది. ఆ బూడిద నుంచే మందారం, తులసి, ఉసిరి, మారేడు మొక్కలు ఉద్భవించాయట. ఆ వృత్తాంతమంతా ఈ కార్తికంలోనే జరిగిందని పురాణాలు చెప్పడం వల్లే తులసికి ఈ నెలలో అంత ప్రాధాన్యం ఇస్తాం. ఈ మాసంలోనే తులసి కల్యాణాన్నీ నిర్వహిస్తాం.


◆ ఈ మాసంలో వన భోజనాలు ఎందుకు చేయాలి?

☛ బంధువులూ, ఆత్మీయులూ కలిసి సమీపంలో ఉండే ఉద్యానవనాలకూ, తోటలకూ వెళ్లి పచ్చని ప్రకృతి మధ్య విందు ఆరగించడం... అదే సమయంలో సంతోషంగా దైవ సంబంధిత కథలు వింటూ సత్కాలక్షేపం చేయడమే వనభోజనాల పరమార్థం. సద్బుద్ధిని ప్రసాదించమని శివుడినీ, విష్ణువునీ ప్రార్థించే ఈ వనభోజనాల్లో పాటించాల్సిన నియమాలు కొన్ని ఉన్నాయి. వనభోజనం చేసే సమయంలో ఉసిరి, మారేడు, తులసి, మందార మొక్కల్ని నాటాలని 'ధర్మసింధు' గ్రంథం చెబుతోంది. మొక్కల పెంపకం పట్ల అభిరుచిని పెంచేందుకే బ్రహ్మనాయుడి కాలంలో వనభోజనాల సంస్కృతి ఆరంభమైందని చరిత్ర చెబుతోంది. ఇక, ఉసిరి మొక్కను నాటాలని ఎందుకు అంటారంటే... గ్రామాల్లోని బావులూ, చెరువుల్లోని నీళ్లు ఉప్పగా ఉంటాయి. ఆ నీటిలో ఉసిరి కట్టెల్ని వేస్తే అవి తియ్యగా మారతాయి. అలాగే, పూర్ణఫలంగా పిలిచే ఉసిరికాయ చెట్టు దగ్గర కూర్చుని భోజనం చేస్తే దోషగుణాలూ తొలగిపోతాయి. కార్తికంలో స్నానం, దీపం, దానంతోపాటు వనభోజనమూ ప్రధానమే కాబట్టి దానికీ ప్రాధాన్యం ఇస్తారు.



– ఆచార్య కాకునూరి సూర్యనారాయణమూర్తి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త

అవీ ఇవీ






కోతుల కోసం... పులులు!

కోతుల బెడద ఎలా ఉంటుందో తెలుసు కదా! నిల్చోనియ్యవూ, కూర్చోనియ్యవూ... ఒక్కోసారి ఇంట్లోంచి బయటకు రావడమే కష్టం. పంటలు నాశనం చేస్తాయి, చెట్లకు కాయలు ఉంటే తెంపి పడేస్తాయి. ఏ వడియాలో ఎండబెడితే ఖతం చేసి పడేస్తాయి. బియ్యంలాంటివి ఆరబెడితే తినేస్తాయి. ఇలా కోతుల ఆగడాల గురించి ఎంత చెప్పినా తక్కువే. అయితే, వీటిని భయపెట్టేందుకు కొందరు కొండముచ్చు ఫొటోలని ఇంటికి తగిలించుకుంటారు. ఇది తెలిసిన విషయమే! కానీ కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామస్థులు మాత్రం ఇందుకు భిన్నంగా పులులను ఇంటి ముందు ఉంచుతున్నారు. 'పులులేంటీ, ఇంటి గుమ్మాల ముందు ఉంచడం ఏంటీ' అనేగా మీ అనుమానం. ఇవి నిజమైన పులులు కాదులెండి... బొమ్మ పులులు. వీటిని గుమ్మాల దగ్గరా, కిటికీల దగ్గరా, బియ్యంలాంటివి ఆరబెడితే అక్కడా ఉంచి కోతులని బెదరగొడుతున్నారట. కొన్నేళ్లుగా కోతులతో విసిగిపోయిన గ్రామస్థులు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు.

సిగ్నల్ జంప్ చేస్తున్నారా?

ఎవరూ చూడట్లేదు కదా అని ట్రాఫిక్ సిగ్నల్‌ని జంప్ చేయడం మనకి కొత్తేం కాదు. ట్రాఫిక్ పోలీసులకు దొరికితే సరే, లేకపోతే చల్లగా జారుకుంటాం. అలా కాకుండా అక్కడ ఏ పోలీస్ మనల్ని ఆపకున్నా, మన బండిపైనా, కార్‌పైనా ఉన్న చలాన్లన్నీ బిల్‌బోర్డుపైన పెద్దగా కనిపిస్తే ఎలా ఉంటుంది? బెంగళూరు నగరంలోని ట్రినిటీ జంక్షన్‌లో ఉన్న బిల్‌బోర్డులు ఏఐ టెక్నాలజీ సాయంతో ఇదే పనిచేస్తున్నాయి. అక్కడి ట్రాఫిక్ పోలీసులు... కార్స్24, క్రాష్ ఫ్రీ ఇండియా, మండే వెంచర్స్ సంస్థలతో కలిసి ఈ బిల్ బోర్డులని రూపొందించారు. వందమీటర్ల దూరం నుంచే మన వాహనాలపైన ఉన్న చలాన్లు, ఫిర్యాదులు ఉంటే అవీ, ఎన్ని చోట్ల సిగ్నల్ జంప్ చేశాం వంటి వివరాలన్నీ బిల్ బోర్డులపైన తాటికాయంత అక్షరాలతో కనిపిస్తాయి. అలాగే మన వాహనాలకు బీమా ఉందా, చెల్లిపోయిందా, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉందా వంటి వివరాలన్నీ చూపిస్తాయి. ఏ చలాన్లూ లేకపోతే సరే... మరి ఉంటే ఇలా అందరి ముందూ కనిపిస్తే పరువు పోతుంది కాబట్టి చాలామంది చలాన్లని క్లియర్ చేసుకుంటున్నారట.




పేరు పెట్టినందుకు రూ.27 లక్షలు!

ఇంట్లో పాపాయి పుడితే, తక్షణం చేసే పనేంటి... పేరు గురించిన ఆలోచనే కదా! నమ్మకం ఉన్నవాళ్లు జాతకం ప్రకారం పెడతారు, తక్కినవాళ్లు తమతమ అభిరుచుల ప్రకారం పెడుతుంటారు. అమెరికా మహిళ 37 ఏళ్ల టేలర్ హంఫ్రే పని కూడా ఇదే, పిల్లలకు మంచి మంచి పేర్లని ఆలోచించి పెట్టడం. అయితే అందుకు ఆమె వసూలు చేసే మొత్తం ఎంతో తెలిస్తే మాత్రం ముక్కున వేలేసు కోవాల్సిందే. అవును, ఒక్కపేరు పెట్టినందుకు టేలర్ దాదాపుగా రూ.27లక్షల రూపాయలు వసూలు చేస్తుంది. అయితే ఇదేమంత తేలికైన పని కాదట. పేరు పెట్టే పాపాయి వంశ చరిత్ర మొత్తం చదివి, వాళ్లింట్లో పెద్దవాళ్ల పేర్లూ, వాళ్ల గొప్పతనం, పాప తల్లిదండ్రుల అభిరుచులూ తెలుసుకుంటుందట. అలాగే తల్లిదండ్రులకు ఓ ప్రశ్నావళిని కూడా ఇచ్చి సమాధానాలు రాబట్టి ఆపైన కొత్తతరానికి తగినట్టుగా మంచి పేరు పెడుతుందట. పదేళ్లుగా ఈ పనిచేస్తున్న టేలర్ ఇంతవరకూ 500 మంది పిల్లలకు నామకరణం చేసిందట. 2020లో అత్యధికంగా 100 మందికి పేర్లు పెట్టింది. ఈమె ఎలాంటి పేర్లు పెడుతుందో చూద్దామని ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లలో ఫాలో అయ్యేవారూ ఎక్కువే.



కలువలు మళ్లీ విచ్చుకున్నాయ్!

లేత గులాబీరంగులో విచ్చుకునే ఆ కలువలకోసం కశ్మీర్ ప్రజలు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికా కల నెరవేరింది! ఇందులో మరీఅంత వింత ఏముందీ అనుకోవచ్చు కానీ, ఒకప్పుడు కశ్మీర్ లోయలోని ప్రజలకు ఈ పూలే జీవనాధారం. వీటి కాడలని 'నద్రూ' అంటారు. వీటితో పచ్చళ్లు పెడతారు, రుచికరమైన వంటకాలు చేస్తారు. అయితే, ఈ కలువలు అన్నిచోట్లా పెరగవు... ఉలార్ మంచినీటి సరస్సే వీటి ఆవాసం. ఇదంతా ఒకప్పుడు. 1992లో జీలంనదికి వచ్చిన వరదల కారణంగా ఈ సరస్సులో పెద్దఎత్తున బురద పేరుకుపోయింది. దానికితోడు పరిశ్రమల నుంచి వెలువడిన రసాయనాలు సరస్సుని కలుషితం చేశాయి, ఆక్రమణలూ పెరిగాయి. పూలు పూయడం అరుదైపోయింది. దాంతో ఈ సరస్సుకి తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రజలే నడుం బిగించారు. 2020 నుంచి మొదలుపెట్టి 80లక్షల క్యూబిక్ మీటర్ల బురదని తవ్వి తీసి సరస్సుని శుభ్రం చేశారు. కలుషితాలు చేరకుండా కఠినచర్యలు తీసుకున్నారు, కలుపు తీసి, చేపలకు ఊపిరాడేట్టు చేశారు. అలా, 30 ఏళ్ల తర్వాత కలువలు కనువిందు చేయడం మొదలుపెట్టాయి. అదీ ఈ పూలవెనుక కథ!





ఈ బ్యాండేజ్ వేస్తే...
రక్తస్రావం ఆగిపోతుంది



యురి... ఇండో-పాక్ సరిహద్దుల్లోని ఓ కుగ్రామం. అక్కడి ఉగ్రవాద స్థావరాలపైన 2016లో భారత్ చేపట్టిన సర్జికల్ స్ట్రైక్... సుప్రసిద్ధం. ఆ స్ట్రైక్ ముగించి తిరిగొస్తున్నప్పుడు... ఓ జవాను మందుపాతర మీద కాలు వేసి తీవ్రగాయాలపాలయ్యాడు. రక్తస్రావం ఆగట్లేదు. హెలికాప్టర్ రావడానికి గంటైనా పడుతుంది... ఈలోపు స్రావాన్ని ఆపితీరాలి! అప్పుడే మన సైనికులు తొలిసారి ఆ 'బ్యాండేజ్'ని వాడారు! కేవలం మూడు నిమిషాల్లోనే స్రావం ఆగి జవాను బతికాడు. ఆక్సియోస్టాట్ అనే ఆ బ్యాండేజ్ అప్పుడే వెలుగులోకి వచ్చింది! దాని వెనకో కథ ఉంది...



అతని పేరు లియో మావేలి. కేరళ తిరుచ్చూరు జిల్లాలోని ఇరింజాలకుడ అనే పట్టణం తనది. మధ్యతరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత కొచ్చిన్ యూనివర్సిటీలో బయోఇంజినీరింగ్‌లో చేరాడు. ఆ యూనివర్సిటీతో లంకె ఉన్న స్వామి దయానంద సరస్వతి యూనివర్సిటీలో పరిశోధనకని దిల్లీ వచ్చాడు. లియోకి నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరి... సైనికుడిగా మారాలన్న కల కూడా ఉండేది. ఆ దిశగా ప్రయత్నించాడుకానీ... సెలెక్ట్ కాలేదు. ఆ బాధలో దక్షిణ దిల్లీలోని తన గది నుంచి యూనివర్సిటీ క్యాంపస్‌కి స్కూటర్‌పైన వస్తున్నప్పుడే ఆ సంఘటన జరిగింది. లియో పక్కనే బైకు మీద వస్తున్న ఓ యువకుణ్ణి వెనక నుంచి కారు ఒకటి ఢీకొట్టి... వెళ్ళిపోయింది. 'తలకి తీవ్రగాయమైన అతణ్ణి తీసుకుని అంబులెన్స్‌లోకి ఎక్కాను. రక్తం ఆగట్లేదు. ఆసుపత్రికి వెళ్లేసరికి నా ఒళ్లంతా నెత్తురే! అదృష్టవశాత్తు అతను బతికినా... ఆ సంఘటన నన్ను నిలవనీయలేదు. ప్రమాదాలు జరిగాక రక్తస్రావాన్ని వెంటనే ఆపడానికి కొత్తగా ఏదైనా కనిపెట్టాలని నిర్ణయించుకున్నాను...' అంటాడు లియో.

ఆ 20 నిమిషాలు ముఖ్యం!

మనదేశంలో ఏటా 1.75 లక్షలమంది రోడ్డుప్రమాదాల్లో చనిపోతుంటే... వాళ్లలో 40 శాతం మంది కేవలం అధిక రక్తస్రావం కారణంగానే మరణిస్తున్నారట! 'సైన్యంలో ఈ పరిస్థితి మరింత ఘోరంగా ఉందని నా అధ్యయనంలో తేలింది. అక్కడ అరవై శాతం మరణాలకి సకాలంలో ఆపలేని రక్తస్రావమే కారణం అంటారు! నేనూ సైన్యంలో చేరాలని కలలుకన్నవాణ్ణి గనక... అది నన్ను బాగా కదిలించింది. అప్పటిదాకా మన సైనికులు రక్తాన్ని ఆపే బ్యాండేజ్‌లని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఉండేవాళ్లు కానీ... వాటి సరఫరా తక్కువగానూ ధరలు చాలా ఎక్కువగానూ ఉండేవి. నేను అటు సైనికులకీ ఇటు సామాన్యులకీ పనికొచ్చేలా రక్తాన్ని మరింత వేగంగా ఆపే బ్యాండేజ్‌ని తయారుచేయాలనుకున్నాను' అంటాడు లియో. అలా ఏడాదిపాటు పరిశోధించి 'కైటోసన్' అనే సహజ పాలిమర్‌తో... రక్తస్రావాన్ని ఆపొచ్చని గుర్తించాడు. పీతల డొప్పలు, రొయ్యల పైపొరలో ఉన్న 'కైటన్' అనే పదార్థంతో కైటోసన్‌ని ఉత్పత్తి చేస్తుంటారు. దాన్ని ఆహారపదార్థాల నిల్వకీ, నీటి శుద్ధీకరణకీ వాడుతుంటారు! అలా తప్ప, ఔషధరంగంలో వాడరు... ఎందుకంటే జలచరాల నుంచి కైటన్‌ని తీసినప్పుడు వాటి ప్రొటీన్ వ్యర్థాలు ఏవైనా ఉండిపోతే... అది ప్రాణాపాయంగా మారుతుంది కాబట్టి. ఇదే, లియోకి పెను సవాలుగా మారింది...

కన్నీరైన వేళ...

రెండేళ్లు... పగలూరాత్రీ శ్రమించి ఆ సవాలుని అధిగమించాడు లియో. అతిస్వచ్ఛమైన కైటోసన్‌ని ఉత్పత్తి చేసే టెక్నిక్‌ని కనిపెట్టాడు. ఎంతపెద్ద గాయమైనా సరే మూడు నిమిషాల్లోనే రక్తస్రావాన్ని ఆపే ఆక్సియోస్టాట్ బ్యాండేజ్‌ని తయారుచేశాడు. 'వీటన్నింటికీ సొంత డబ్బులే పెట్టాను. నాన్న రిటైర్ అయితే ఆ పీఎఫ్‌ని తీసుకున్నాను. అవీ సరిపోలేదు. ఇంతచేసీ... మా బ్యాండేజ్‌కి ప్రభుత్వ అనుమతులు రాలేదు. దిల్లీలో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే తీవ్ర అవమానాలే ఎదురయ్యాయి. ఓసారి కేంద్ర అధికారులు గుజరాత్‌లో స్టార్టప్ సమావేశం పెడితే వెళ్లి 'ఎందుకిలా అవమానిస్తున్నారు' అంటూ ఏడ్చేశాను. ఆ తర్వాతే, నా బ్యాండేజ్‌ని వాళ్లు పరిశీలించారు. క్లినికల్ ట్రయల్స్‌లో వందశాతం సత్ఫలితాల్ని సాధించాం. ఆ తర్వాత భారత సైన్యమూ వాటిని తీసుకుంది. 2016లో యురి ఘటన తర్వాత సైనికాధికారులే ఫోన్ చేసి మా బ్యాండేజ్ ఓ జవాను ప్రాణాన్ని ఎలా కాపాడిందో చెబుతుంటే నాకు కన్నీళ్లు ఆగలేదు' అంటాడు లియో.

ప్రస్తుతం పదాతిదళంలోని 300 పైచిలుకు బెటాలియన్‌లలోనూ ఆక్సియోస్టాట్‌నే వాడుతున్నారు. ఎన్ఎస్‌జీ, బీఎస్ఎఫ్ వంటి దళాలూ వీటినే ఉపయోగిస్తున్నాయి. మరోవైపు అపోలో, ఫోర్టిస్, జైడస్ సహా 400పైగా ఆసుపత్రులు తమ ఆపరేషన్ థియేటర్‌లలోనూ అంబులెన్సుల్లోనూ ఉపయోగిస్తున్నాయి. రూ.70 నుంచే ధరలు ఉండటంతో... సామాన్యులు ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లలోనూ వాడుతున్నారు. మనదేశంలోనే కాదు... ప్రపంచంలోని 50పైచిలుకు దేశాలకీ ఆక్సియోస్టాట్‌ను ఎగుమతి చేస్తున్నారు. అమెరికన్ ఎఫ్‌డీఏ అనుమతులు పొందిన ఏకైక భారతీయ గాయనివారణ ఉత్పత్తి ఇదొక్కటే! అంతేకాదు, ఆక్సియోస్టాట్ బ్యాండేజ్ ఆధారంగా లియో స్థాపించిన 'ఆక్సియో బయోసొల్యూషన్స్' సంస్థ ఏటా పాతికకోట్ల రూపాయల దాకా ఆదాయాన్ని చూస్తోంది. ★





ఫుడ్ ట్రెండ్

ప్రతి చిన్న విజయాన్నీ, వేడుకనీ స్వీటుతోనే పంచుకోవాలనుకుంటారు ఎవరైనా. మరి అదే స్వీటు కొత్త రుచులతోపాటు రంగులు అద్దుకుని నోరూరిస్తే... భోజనం తర్వాత వేసుకునే కిళ్లీ మిఠాయిపొట్లంలా మారిపోతే... కనీసం రెండుమూడైనా వరుసపెట్టి తినేస్తాం కదూ. కునాఫా, కాజూకత్లీ, పాన్... అలా నయా రుచుల్లోకి మారిపోయి మిగిలిన పదార్థాలతో పోటీపడుతూ ఇప్పుడు ఎక్కువమందిని ఆకట్టుకుంటున్నాయి.



కోరినట్లుగా కునాఫా...





కునాఫా... అయిదు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ మిఠాయి పుట్టింది పాలస్తీనాలో అయినా క్రమంగా అరబ్‌దేశాల ద్వారా మన భారత్‌లోనూ ప్రవేశించింది. సన్నని సేమియాతో తయారుచేసే ఈ స్వీటు ఒకప్పుడు కేవలం ఒకటి రెండు రుచుల్లో మాత్రమే దొరికేది. కొన్నాళ్ల క్రితం దుబాయ్‌కు చెందిన ఓ షెఫ్ కునాఫా మిశ్రమాన్ని చాక్లెట్‌లో స్టఫ్‌చేయడంతో అది బాగా వైరల్ అయ్యింది. ఇంకేముంది... మరి కొందరు మాస్టర్‌షెఫ్‌లు దీంతో రకరకాల ప్రయోగాలు చేసి కునాఫాకు నయా రూపాన్నీ, ఫ్లేవర్లనూ అద్ది, దీని డిమాండును పెంచేశారు. కునాఫా తయారీలో సన్నని సేమియానే కీలకం. ఈ సేమియాను మందంగా వెడల్పుగా పేర్చి... మధ్యలో క్రీమ్ లేదా చీజ్‌ను ఉంచి బేక్ చేస్తారు. ఆపైన మళ్లీ చక్కెర పాకం వేసి, గులాబీరేకులు, పిస్తా పలుకులు తదితరాలను అలంకరిస్తారు. అలా కాస్త క్రంచీగా, తియ్యగా, నోట్లో వేసుకుంటే కరిగిపోయే కునాఫా తయారవుతుంది. ఇప్పుడు అదే కునాఫా బర్ఫీ, కోన్, మోదక్, రోల్, సమోసా... ఇలా రకరకాల ఆకృతుల్లోనే కాదు... డ్రైఫ్రూట్స్, చాక్లెట్, కోవా, ఖర్జూరాలు, పండ్లు, చీజ్, కోవా, పనీర్... ఇలా కోరుకున్న పదార్థాల స్టఫింగ్‌తో వస్తుండటంతో అచ్చంగా ఈ వెరైటీలతోనే స్వీట్ బాక్సుల్ని తయారు చేస్తున్నాయి మిఠాయిదుకాణాలు. లేదూ, దీన్ని ఇంట్లోనే చేసుకోవాలనుకునే వారికోసం కునాఫా సేమియా విడిగా కూడా దొరుకుతోంది. దాంతో ఇంట్లోనే నచ్చిన ఫ్లేవర్‌తో చేసుకోవచ్చు అన్నమాట. ఆలస్యమెందుకు ట్రై చేసేయండి మరి.









ఇది కిళ్లీ మిఠాయి...

రకరకాల పదార్థాలతో మంచి విందును ఆరగించాక... చివరగా రెండుమూడు తమలపాకులు, కాస్త సున్నం, వక్కపొడి, గుల్కంద్‌తో కలిపి తయారుచేసిన మీఠాపాన్‌ను వేసుకుంటే తేలిగ్గా ఉంటుందనేది తెలిసిందే. కానీ, చాలామంది కిళ్లీ మంచిది కాదని భావిస్తూ... తినాలని మనసులో ఉన్నా నోరు కట్టేసుకుంటారు. అలాంటివారికోసమే తయారీదారులు ఇప్పుడు కిళ్లీని కమ్మని మిఠాయి రూపంలోకి మార్చేశారు. ఎలాగంటే... వీటిలో తమలపాకులు, వక్క, సున్నం వంటివి తక్కువగా, గుల్కంద్, డ్రైఫ్రూట్స్, చాక్లెట్, ఖర్జూరాలు ఎక్కువ మోతాదులో ఉంటాయన్నమాట. ఆ జాబితాలో పాన్‌బైట్స్, స్టఫ్‌డ్ డేట్స్ పాన్, క్యాండీ, ఠండామీఠాపాన్, పాన్‌బర్ఫీ, చాక్లెట్ కోటెడ్ బాల్స్ లేదా స్టఫ్డ్ కిళ్లీ... ఇలా ఎన్నో రకాలున్నాయి. అచ్చంగా స్వీటు మాదిరి తినేలా ఉండటంతో పెద్దలేంటీ, పిల్లలూ ఎలాంటి సందేహం లేకుండా ఈ కిళ్లీల రుచిని ఆస్వాదించొచ్చు.

రంగురంగుల కాజూకత్లీ...

అమోఘమైన రుచితో నోట్లో వేసుకోగానే కరిగిపోయేలా ఉంటుంది కాజూకత్లీ. కేవలం జీడిపప్పు, చక్కెర కలిపి తయారుచేసే ఈ కమ్మని మిఠాయి ఎక్కువమందికి ఫేవరెట్ స్వీటని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నిన్నటివరకూ తెల్లగా, సాదాగా మాత్రమే కనిపించిన ఈ స్వీటును మరికాస్త కొత్తగా మార్చేస్తున్నారు మిఠాయివాలాలు. అలా కాజూకత్లీ కూడా కోరుకున్న రంగులతో రుచులతో మెప్పించేస్తోంది. అంటే... యాలకులు, గులాబీ, కుంకుమపువ్వు, మామిడి, పిస్తా, చాక్లెట్... అంటూ ఆయా ఫ్లేవర్లతోపాటు ఆ రంగుల్లోకి మారిపోయి నోరూరిస్తోంది. ఉదాహరణకు గులాబీనీరూ, గులాబీరేకల్ని కలిపి చేసే రోజ్ కాజూకత్లీ మంచి సువాసననూ అందిస్తుంది. అదే డ్రైఫ్రూట్స్ వెరైటీని తీసుకుంటే..మెత్తగా ఉండే ఈ మిఠాయిలో మధ్యమధ్య జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు నోటికి తగులుతూ వావ్ అనిపిస్తాయన్నమాట. డ్రైఫ్రూట్స్ పలుకులు స్టఫ్‌చేసిన వెరైటీ కూడా ఉందిప్పుడు. చక్కెర వద్దనుకునేవారికోసం బెల్లంతో తయారుచేసిన కత్లీ వెరైటీ కూడా అందుబాటులో ఉంది. కాబట్టి... నచ్చిన ఫ్లేవర్డ్ కాజూకత్లీని తిని ఆ రుచిని ఆస్వాదించడంతోనే ఆగిపోకుండా ఆత్మీయుల దగ్గరకు వెళ్తున్నప్పుడు కానుక రూపంలో ఇచ్చిచూడండి మరి.



దీపం... జ్ఞానరూపం!

దీపావళి... హృదయ దీపాల్ని వెలిగించుకోవాల్సిన సమయం. అంతరంగాల్లోని అసుర చీకట్లను వదిలించుకోవాల్సిన సందర్భం. చుట్టూ ఉన్న జీవితాలకు ప్రేమ కాంతిని పంచాల్సిన సుదినం. చీకటి నుంచి వెలుతురు వైపుగా మనం ప్రారంభించే ప్రయాణంలో... నరకుడి స్వభావం ఒక ప్రమాద హెచ్చరిక, సత్యభామ విజయం ఓ మార్గసూచి.



భూగోళానికి ఎవరో కాటుక పూసినంత చీకటి. సూర్యచంద్రుల్ని ఎక్కడో దాచినంత చీకటి. నక్షత్రాల్ని ఏ దుష్టశక్తులో చిదిమేసినంత చీకటి. ఆ తమస్సును చీల్చుకుంటూ, తిమిరంపైన సమరానికి బయల్దేరింది శ్రీకృష్ణ సమేత సత్యభామ.

సత్య... వెలుగుల ప్రతినిధి.

నరకాసురుడు... చీకటి ఏలిక.

అంధకారం... వెలుతురును భరించలేదు, కాంతి ఉనికిని కాసేపైనా తట్టుకోలేదు. ఆ అక్కసు కొద్దీ, నరకుడు భామాదేవిని అనరాని మాటలన్నాడు. అబల చేతులు ఆయుధాల్ని సైతం పైకెత్తలేవని గేలి చేశాడు. బాలవంటూ, బేలవంటూ ఎగతాళి చేశాడు. అప్పటికే, పోరాడి అలసిన కృష్ణమూర్తికి కాస్తంత విశ్రాంతినిచ్చి... తానే యుద్ధం చేసింది సాత్రాజితి. శరపరంపరతో నరకుడికి నరకం చూపింది. కాసేపటికి, కృష్ణుడు కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగాడు. సుదర్శన చక్రంతో అసురుడిని అంతం చేశాడు. ఆ శుభవార్త తెలియగానే 'దీపం కుర్యాత్... దీపం కుర్యాత్... దీపాలు వెలిగించండి, దీపాలు వెలిగించండి' అని ముల్లోకాలకూ పిలుపునిచ్చారు దేవతలు. నరకుడి భయంతో చీకటి కొంపల్లో తలదాచుకున్న సామాన్య జనం... ఆ మాట వినిపించగానే, ఆనందంగా దీపాలు వెలిగించారు.

ఇది... భాగవత 'దీపావళి'.

★ ★ ★

'రాముడొస్తున్నాడు'...

'సీతారాములొస్తున్నారు'...

పద్నాలుగేళ్ల తర్వాత, కోసల దేశానికి చీకటి రోజులు తొలగిపోయాయి. ఎటు చూసినా ఆనందం తాండవిస్తోంది. విజయదశమి నాడు లంకలో రావణ సంహారం పూర్తయిపోయింది. వెంటనే, విభీషణుడి పట్టాభిషేకమూ జరిగిపోయింది. తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు మొదలైపోయాయి. ఆ తీపి కబురు అయోధ్యకు అందింది. సీతారాముల రాక కోసం... జనం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ముంగిట్లో ముగ్గులు వేశారు. ద్వారాలకు తోరణాలు కట్టారు. వీధుల్ని అందంగా అలంకరించారు. అంతలోనే, ఆకాశంలో మెరుపు. చుక్కల్ని దాటుకుంటూ, మబ్బుల్ని చీల్చుకుంటూ పుష్పక విమానం రాచవీధిలో దిగింది. ఆ సందడికి పౌరులంతా పరుగుపరుగున వచ్చారు. 'మా రామయ్య... మానవజాతికి దారిదీపం!' అంటూ ఆనందబాష్పాలు రాల్చారు. 'మా సీతమ్మను... చిదిమి దీపం పెట్టుకోవచ్చు' అని మురిసిపోయారు. అమావాస్యనాడూ సంపూర్ణ చంద్రోదయం జరిగినట్టు... గడప గడపలో, వీధి వీధిలో, రాజ్యమంతటా దీపాలంకరణలే.

ఇది... రామాయణ 'దీపావళి'.

★ ★ ★

ఉద్దాలకుడు... మహా రుత్విజుడు. విశ్వజిత్ అనే యాగాన్ని తలపెట్టాడు. సూర్యాస్తమయంలోపు యజ్ఞకర్త తన సకల సంపదల్నీ సజ్జనులకు దానం చేయాలన్నది నియమం. ఆ క్రతువును ఆసక్తిగా గమనిస్తున్న పసివాడైన నచికేతుడు తండ్రి దగ్గరికెళ్లి 'నాన్నా! నేనూ మీ సంపదనేగా! నన్నెవరికి దానం చేస్తారూ?' అని అమాయకంగా అడిగాడు. పని ఒత్తిడిలో ఉన్న ఉద్దాలకుడు 'నిన్ను యముడికి ఇచ్చేశాను. వెళ్లిపో...' అంటూ కసురుకున్నాడు. ఆ మాట నిజమేనని భావించాడు నచికేతుడు.

నేరుగా యమలోకానికి బయల్దేరాడు. ఆ సమయానికి సమవర్తి దైవకార్యం మీద ఎక్కడికో వెళ్లాడు. 'నా యజమాని అనుమతి లేనిదే, పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోను' అంటూ ఆ బాలుడు భీష్మించుకుని కూర్చున్నాడు. మూడురోజులూ పస్తులున్నాడు. అంతలోనే యమరాజు తిరిగొచ్చాడు. ఇంటికి వచ్చిన అతిథిని అలా ఉపవాసం ఉంచడం మహాపరాధమని భావించాడు. ప్రాయశ్చిత్తంగా, ఏవైనా మూడు వరాలు కోరుకోమని నచికేతుడికి సూచించాడు. ఆ పసివాడు విజ్ఞతతో ఆలోచించి, ఒకటో వరంగా... తన తండ్రికి ముక్తిని ప్రసాదించమని అడిగాడు. రెండో వరంగా... స్వర్గలోక ప్రవేశానికి అర్హతనిచ్చే అగ్నికార్యం గురించి చెప్పమని ప్రార్థించాడు. రెండు కోరికలకూ బేషరతుగా ఆమోదం తెలిపాడు యముడు. మూడోవరంగా తనకు బ్రహ్మజ్ఞానాన్ని అందించమని వేడుకున్నాడు నచికేతుడు. అది అత్యంత గుహ్యమైన విషయమనీ, ఇతరులకు చెప్పడం కుదరదనీ తిరస్కరించాడు యమరాజు. అయినా నచికేతుడు వదిలిపెట్టలేదు. మొత్తానికి... ఆ బాలుడి జిజ్ఞాసను గ్రహించి, బ్రహ్మజ్ఞానాన్ని అనుగ్రహించాడు. ఆధ్యాత్మిక సంపత్తితో జ్ఞానజ్యోతిలా తిరిగొస్తున్న నచికేతుడికి భూలోకం వరుస దీపాలతో స్వాగతం పలికింది.

ఇది... ఉపనిషత్ 'దీపావళి'.

★ ★ ★

దీపం... ఆకారంలో ఓంకారం, వర్ణంలో స్వర్ణం, కాంతిలో దివ్యతేజం. అందులోనే జీవాత్మనూ, పరమాత్మనూ దర్శించుకుంటాడు మనిషి. 'త్వమగ్నే! యజ్ఞానాం హోతా, విశ్వేషాం హితః దేవేభిర్మానుషే జనే.. ఓ జ్యోతిస్వరూపమైన పరమాత్మా! నువ్వు కర్మఫల దాతవు, సర్వహితుడవు, సుప్రసిద్ధుడవు' అంటూ ఈశ్వరుడిని దీపమూర్తిగా కీర్తించింది వేదం. సృష్టి ఆరంభంలో భూగోళమంతా ఓ మహాదీపంలా దేదీప్యమానంగా వెలిగేదని చెబుతుంది నారదీయ సూక్తం. సూర్యుడు మొదలు చిరుదీపం వరకూ... సమస్త కాంతులకూ సృష్టికర్తే ఆధారమంటుంది ఉపనిషత్తు. పూర్వం నుంచీ మన పెద్దల తత్వచింతనకు దీపమే దారిచూపింది! అగ్ని

ఉపాసన అత్యంత ప్రాచీనమైంది. ఇప్పటికి కూడా కష్టసుఖాల్లో, పండగపబ్బాల్లో, వ్రతాలూ నోముల్లో, సభలూ సమావేశాల్లో... చివరికి చావుపుట్టుకల సమయంలోనూ దీపం వెలగాల్సిందే! 'దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం సర్వతమోపహం... దీపేన సాధ్యతే సర్వం, సంధ్యాదీపం నమోస్తుతే'... అంటూ ప్రతి సంధ్యలోనూ దీపంలోని దివ్యాత్మకు ప్రణతులర్పిస్తుంది భారతీయత.

పరమాత్మను 'జ్యోతిషాం జ్యోతి... దీపాలకే దీపం' అని వర్ణిస్తుంది శాస్త్రం. రేపల్లెలోని గోపకాంతలు రోజూ సాయంత్రం నందుడి ఇంటి దీపం నుంచే తమ దీపాల్ని వెలిగించుకుని వెళ్లేవారట. ఆ సమయంలో బాలకృష్ణుడి ముద్దుముచ్చట్లను తిలకిస్తూ... దీపం ముందు ఉన్నామన్న సంగతే మరిచిపోయేవారట. ఆ పరధ్యానం వల్ల కొన్నిసార్లు చేతులు చురుక్కుమనేవట. పరమాత్మ కోటిసూర్య ప్రభల అఖండ దీపమైతే... ఆ తేజస్సుకు సూక్ష్మరూపం... దేవుడి గూట్లోని చిరుదీపం.

★ ★ ★

మనిషికి మొత్తం 24 మంది గురువులని చెబుతుంది 'అవధూత గీత'. అందులో దీపమూ ఒకటి. నేర్చుకునే మనసు ఉండాలే కానీ, దీపమే దిక్సూచిగా మారి మనల్ని విలువల బాటలో నడిపిస్తుంది. వ్యక్తిత్వ కాంతిని విస్తరింపజేస్తుంది.

దీపంతో మానవుడికి ఒక పోలిక ఉంది. జీవాత్మ దీప స్వరూపమని అంటారు. మనిషితో దీపానికి చాలా పోలికలు ఉన్నాయి. మానవ శరీరంలానే దీపమూ పంచభూతాత్మకమే. మట్టి ప్రమిద భూతత్వానికీ, తైలం జలతత్వానికీ, తెల్లని వత్తి ఆకాశతత్వానికీ, దీపాన్ని స్థిరంగా నిలబెట్టే గాలి వాయుతత్వానికీ, భగభగ మండే జ్యోతి అగ్నితత్వానికీ ప్రతీకలు. దీపం దానంతట అదే వెలగదు. ఎవరో ఒకరు వెలిగించాలి. అంటే, బలమైన ప్రయత్నం అవసరం. కాబట్టే, దీప ప్రజ్వలనను... ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తుల సమాహారమని చెబుతారు. దీపం వెలిగించాలనే ఆలోచన... ఇచ్ఛాశక్తి. ఎలా వెలిగించాలనే తెలివిడి... జ్ఞానశక్తి. ఆ నైపుణ్యాన్ని ఆచరణలో పెట్టడం... క్రియాశక్తి. బయటి చీకటిని తొలగించుకోడానికైనా, లోపలి చీకటిని వదిలించుకోడానికైనా, లక్ష్య సాధనలో అవరోధాల చీకటిని అధిగమించడానికైనా ఇదొక్కటే మార్గం. అంతర్ జ్యోతిని వెలిగించుకునే ప్రక్రియను ఆధ్యాత్మిక పరిభాషలో 'సద్యోవబోధ' అంటారు. బృహదారణ్యకోపనిషత్తులో జనక మహారాజుకూ, యాజ్ఞవల్క్యునికీ మధ్య జరిగే ఓ సంభాషణలో ఆ ప్రస్తావన వస్తుంది...

'మనిషికి వెలుగునిచ్చేది?'

'సూర్యుడు'

'సూర్యుడు లేనప్పుడు?'

'చంద్రుడు'

'చంద్రుడు లేనప్పుడు?'

'దీపం'

'దీపం కూడా లేనప్పుడు?'

'ఆత్మదీపం'.

... కాలం గడిచేకొద్దీ దీపంలోని వత్తి కాలిపోయినట్టు, మనిషిలోని 'నేను' అనే భ్రమ బూడిదైపోవాలి. క్రమంగా తరిగిపోయే చమురులా 'నాది' అనే స్వార్థం అడుగంటాలి. ఒక్కసారి ఆత్మదీపాన్ని వెలిగించుకుంటే... నిత్య కాంతులు ప్రసరిస్తూనే ఉంటాయి.

★ ★ ★

దీపం... సత్య స్వరూపం. చీకటి... అసత్యానికి మారుపేరు. చీకటికి గారడి విద్యలు తెలుసు... తాడును పాములా, పామును తాడులా భ్రమింపజేస్తుంది. తలపుల్ని తప్పుదారి పట్టిస్తుంది. చీకటి మహా కర్కశమైంది... మనిషిని తాత్కాలిక అంధుడిగా మార్చేస్తుంది. ఆ కాసేపూ ఎదురుగా దేవుడే ఉన్నా గుర్తించలేడు. చీకట్లో మనిషిలోని అసుర ప్రవృత్తి పదింతలు పెరుగుతుంది. మహామహా ఘోరాలన్నీ చీకటిపడ్డాకే జరుగుతాయి. కాబట్టే, చీకటంటే అతనికి అంత భయం. ఆ కారు నలుపును మృత్యువు ముఖంలా ఊహించుకుంటాడు. 'అసతోమా సద్గమయా, తమసోమా జ్యోతిర్గమయా, మృత్యోర్మా అమృతంగమయా...' అంటూ చెడు నుంచి మంచి వైపూ, చీకటి నుంచి వెలుతురు వైపూ, మృత్యువు నుంచి అమరత్వం వైపూ తనను తీసుకెళ్లమని సర్వేశ్వరుడిని వేడుకుంటాడు. దీపారాధన సమయంలో దేవుడి ముందు దీపం వెలిగించేది, పూజగదిలోని చీకటిని తొలగించడానికి కాదు... మన మదిలోని అజ్ఞానపు మబ్బుల్ని వదిలించుకోడానికి!

మనుషుల స్వభావాలూ దీపాల్లాంటివే. కొందరు వెలగని దీపాలు, తమోగుణానికి ప్రతీకలు. అంతరంగం నిండా అజ్ఞానమే! కొందరు గుడ్డి దీపాలు, రజోగుణ స్వరూపులు. జీవితమంతా జ్ఞాన-అజ్ఞానాల దోబూచులాటే! కొందరు మాత్రం, దేదీప్యమాన దీపాలు, సత్వగుణ సంపన్నులు. అచ్చమైన జ్ఞాన స్వరూపాలు వీళ్లు. మరణం తర్వాత కూడా ఆత్మీయ బంధువులుగానో, ఆత్మబంధువులుగానో... నాలుగు ఇళ్లలో పటాలై నిలుస్తారు, దీపాలై వెలుగుతారు. నరకచతుర్దశి నాడు పితృదేవతల కోసం యమదీపాలు వెలిగించే సంప్రదాయం పూర్వం నుంచీ ఉంది. అవే వాళ్లకు స్వర్గానికి దారి చూపుతాయట. ఆస్తిపాస్తులు ఇచ్చినా ఇవ్వకపోయినా, మనకంటూ ఓ జన్యు చరిత్రను ప్రసాదించిన మూడుతరాల పెద్దల్ని మనసారా తలుచుకోడానికి

ధ్యాన కాంతి....

మంత్రంతో పన్లేదు. బీజాక్షరం అవసరమే లేదు. దీపమే సద్గురువులా సాధకుడిని ధ్యానస్థితికి తీసుకెళ్తుంది. దీన్నే దీప ధ్యానమనీ, త్రాటక ధ్యానమనీ అంటారు. చీకటి గదిలో... ఎదురుగా కనిపిస్తున్న దీపాన్ని కళ్లార్పకుండా చూస్తూ... క్రమంగా ఆ కాంతి గది నిండా, మది నిండా విస్తరిస్తున్న అనుభూతిని పొందుతాడు సాధకుడు. కొత్త ఆలోచనలు చుట్టుముట్టిన ప్రతిసారీ, దీపం ఆ చొరబాటును అడ్డుకుంటుంది. తొలుత ఒకట్రెండు నిమిషాలతో ఈ సాధనను ప్రారంభించవచ్చు. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలు ఇందుకు అనువైనవని చెబుతారు. దీపధ్యానం వల్ల ఆలోచనల్లో స్పష్టత వస్తుందనీ, జ్ఞాపకశక్తి పెరుగుతుందనీ అంటారు. నిద్రలేమికి పరిష్కారంగానూ సూచిస్తారు. ఆ సమయంలో సుఖాసనం, వజ్రాసనం... ఇలా సౌకర్యవంతంగా అనిపించే ఏ యోగ ముద్రనైనా ఎంచుకోవచ్చు. కాకపోతే, నేత్ర సంబంధమైన సమస్యలు ఉన్నవారు ముందుగా వైద్యుల్ని సంప్రదించడం మేలు.



అనేక రూపాలు!



సందర్భాన్ని బట్టీ, ఉపాసనా రీతిని బట్టీ దీపారాధన పద్ధతి మారిపోతూ ఉంటుంది. కార్తిక మాసంలో ఉసిరికాయలో దీపం వెలిగిస్తే మంచి జరుగుతుందని నమ్ముతారు. అదే, నిమ్మకాయలో వెలిగిస్తే జగదంబ సంతుష్టురాలు అవుతుందని ఓ విశ్వాసం. ప్రత్యేక సందర్భాల్లో పిండిలోనూ దీపం వెలిగిస్తారు. ఇక ఆకుల్లో వెలిగించేది పత్రదీపం. పువ్వుల్లో వెలిగించేది పుష్పదీపం. కొబ్బరికాయలో వెలిగించేది నారికేళ దీపం. సగం నీరు, సగం నూనెతో వెలిగించేది జలదీపం. నదుల ఒడ్డునా, సముద్రతీరాల్లోనూ వెలిగించేది తీరదీపం. దీప ప్రజ్వలనకు రకరకాల నూనెలు వాడుతున్నా, నేతి దీపమే శ్రేష్ఠమని చెబుతారు. పత్తితోనే కాదు... తామరతూడు, అరటి నార, జిల్లేడు మొక్కతోనూ వత్తులు చేస్తారు. దీపావళికి దీపదానాలు చేయడం సంప్రదాయం. దీనివల్ల సకల శుభాలూ కలుగుతాయనీ, సర్వ గ్రహదోషాలూ తొలగిపోతాయనీ విశ్వసిస్తారు. నారదపురాణం దీపావళిని 'దీపదాన మహోత్సవం'గా అభివర్ణించింది. క్షీరసాగర మథనం జరుగుతున్నప్పుడు, మహాలక్ష్మికి దేవకాంతలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని పద్మపురాణం చెబుతోంది. దీపావళి లక్ష్మీపూజకు ఈ ఘట్టమే నేపథ్యం కావచ్చు.

ఇదో మంచి సందర్భం కూడా.

★ ★ ★

రెండు, నాలుగు, ఎనిమిది, పదహారు... ముంగిట్లో ఎన్ని దీపాలున్నా, అందులోని ఏదో ఓ దీపంతోనే మిగిలిన వాటినంతా వెలిగించి ఉంటాం. ఆ దీపాలకు దీపమే... ప్రదీపం! దీపం వెలుగుతుంది, ప్రదీపం వెలిగిస్తుంది. మనిషి ఏనాటికైనా 'ప్రదీపుడు' అనిపించుకోవాలి. తాను బతకడమే కాదు, నలుగుర్నీ బతికించాలి. ఆ నలుగురూ మరో నలుగురిని బతికించేలా స్ఫూర్తినివ్వాలి. అప్పుడే, అతని జీవితానికి సార్థకత. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టి చూడండి, తృప్తిగా భోంచేశాక... ఆ కళ్లు జోడు దీపాల్లా వెలుగుతాయి. కష్టంలో ఉన్నవారికి సాయం చేసి చూడండి, గండం గట్టెక్కాక... ఆ ముకుళిత హస్తాలు వెలుగుతున్న జ్యోతిని తలపిస్తాయి. ఓ పదిమందికి జీవనోపాధి కల్పించి చూడండి, వరుసగా కూర్చుని పనిచేస్తున్నప్పుడు... ఆ శ్రమజీవులు దివ్వెల సమూహంలా అనిపిస్తారు.

బుద్ధుడి మహాభినిష్క్రమణకు ముందు ఆనందుడనే శిష్యుడు కన్నీళ్లు పెట్టుకుంటూ 'స్వామీ! ఇంతకాలం మీరు ఓ దీపమై దారి చూపారు. మీరు లేని భవిష్యత్తు మాకు చీకటిమయమే' అంటూ పాదాల మీద పడ్డాడు. ఆనందుడిని ఓదారుస్తూ 'ఇతరులు అందించే వెలుతురు మీద ఆధారపడేంత పరాధీనత ఎందుకు ఆనందా? నీలోని దీపాన్ని నువ్వే వెలిగించుకో!' అని ధైర్యం చెప్పాడు గౌతముడు. అవును, అప్పుడే మనిషి 'స్వయంప్రకాశ దీపం' అవుతాడు.

ఆదిశంకరుడు ముప్పై రెండేళ్లు జీవించాడు. వివేకానందుడు నలభైలోపే నిర్వాణం పొందాడు. అయితేనేం, ఒకరు దేశాన్ని చుట్టుముట్టిన అజ్ఞానపు చీకట్లను తొలగిస్తే... మరొకరు సనాతన జ్ఞానకాంతిని ప్రపంచానికంతా పంచారు. ముహూర్తం జ్వలితం శ్రేయో న తు ధూమాయితం చిరం... ధూపంలా పొగలుకక్కుతూ కలకాలం బతికేకంటే, దీపంలా కాసేపు వెలుతురు పూలు పూయించి ఆరిపోయినా జన్మ ధన్యమైనట్టే.

★ ★ ★

మనం దెయ్యంతోనో, భూతంతోనో పోల్చి తిట్టుకునే కటిక చీకటికి 'మనుచరిత్ర'లో అల్లసాని పెద్దన వెలుతురుతో సమానమైన హోదాను కట్టబెట్టాడు. చీకటి... కొత్త నెమలిపింఛం ధరించిన శ్రీకృష్ణుడిలా కనువిందు చేస్తోందట, నల్ల హంసలతో అలరారే యమునా నదికి దీటుగా కనిపిస్తోందట, మహావృక్షాలతో కళకళలాడే కాటుక కొండల శ్రేణిని తలదన్నేలా ఉందట! జీవితం అంటేనే సగం చీకటి, సగం వెలుతురు. చీకటిని ద్వేషిస్తూ కూర్చుంటే, సగం జీవితాన్ని వృథా చేసుకున్నట్టే. 'దీపం వ్యవధి కొన్ని గంటలు. బల్బు జీవితకాలం కొన్ని రోజులు. సూర్యచంద్రుల ఆయుర్దాయం మహా అయితే కొన్ని యుగాలు. ఆ తర్వాత అంతా చీకటే! కాబట్టి, అంధకారమే శాశ్వతమని గుర్తించాలి. ఏదో ఒక రోజు వెలుగులు చీకట్లో కలిసిపోవడం ఖాయం. చీకటిని ఆమోదించడమూ నేర్చుకోండి. అది అనివార్యం కూడా' అంటారు జగ్గీ వాసుదేవ్.

వెలుతురే ఉండాలనుకోవడం దురాశ. చీకటి పోదేమో అనుకోవడం నిరాశ. జీవితం చీకటివెలుగుల సమాహారం. ఎవరికి తెలుసు? కొన్నిసార్లు తైలం నిండుకోవచ్చు. వత్తి కొండెక్కి పోవచ్చు. ప్రమిద చేజారిపోవచ్చు. కారణం ఏదైతేనేం, చీకటి అనివార్యం అయినప్పుడు... ఆ మార్పును సవినయంగా స్వీకరించాలి. సుఖదుఃఖాలు కూడా చీకటి వెలుగుల్లాంటివే.

సుఖస్యానంతరం దుఃఖం...
దుఃఖస్యానంతరం సుఖం.
న నిత్యం లభతే దుఃఖం...
న నిత్యం లభతే సుఖం.

ఆ సంక్షోభ సమయంలో... ఆత్మవిశ్వాస దీపాన్ని వెలిగించుకోవడమే వివేకవంతుల లక్షణం.

★ ★ ★

ఓ శిష్యుడు తన గురువు దగ్గరికెళ్లి... 'స్వామీ! వెలుతురు అంటే ఏమిటి?' అని అడిగాడు.

దీంతో, కాస్తంత దూరంలో ఉన్న ఆలయాన్ని చూపిస్తూ...

'అక్కడేం ఉన్నాయి నాయనా?' అని అడిగాడు గురువు.

'గోపురం, మహాద్వారం, గరుడ ధ్వజం, గర్భాలయం...'

టకటకా చెప్పాడు శిష్యుడు.

'అంతేనా? ఆ గుడి ముందు కూర్చున్న యాచకుల్ని గుర్తించలేనంత కాలం... నువ్వు చిమ్మచీకట్లో ఉన్నట్టే. నీ చుట్టూ వెలుతురు సోకనట్టే' అని జవాబిచ్చాడు గురువు.

సమ్యక్ కాంతి అంటే అదే. దీపావళికి మనమంతా వెలిగించాల్సిన మానవతా దీపమూ అదే. ★

పరిశోధన

సంగీతంతో... చదువులో బెస్ట్!

కొంత... ఈ పదాన్ని మీరు ఎలా ఉచ్చరిస్తారు? 'కొ-న్-త' అనే కదా! కానీ ఇప్పుడిప్పుడే గుణింతాలు నేర్చుకుంటున్న పిల్లలు ఈ పదాన్ని 'కొ-మ్-త' అనే పలుకుతారు! మనం దాన్ని సవరించి సరిగ్గా చెప్పేకొద్దీ అసలైన ఉచ్చరణ నేర్చుకుంటారు. ఒక్కో అక్షరానికి ఒక్కో శబ్దం ఉన్నా అవి కలిసి ఓ పదంగా మారేటప్పుడు ఆ శబ్దాల తీరుతెన్నులు మారుతుంటాయి కదా. అవి అలా ఎలా మారతాయో తెలుసుకోవడం... ఓ కీలకమైన సామర్థ్యం. 'ఆ సామర్థ్యాన్ని మీ పిల్లలు వేగంగా అలవర్చుకోవాలంటే వాళ్లకి సంగీతం నేర్పించండి' అని చెబుతున్నారు యూకేలోని అబెడీన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. లండన్‌లో ఐదు నుంచి తొమ్మిదేళ్ళ వయసు పిల్లల పఠనం తీరుతెన్నుల్నీ... చదివేటప్పుడు వాళ్ల మెదడు పనిచేసే విధానాన్నీ ఈ శాస్త్రవేత్తలు అత్యాధునిక పరికరాలతో పరిశీలించారు. మామూలుగా పిల్లలు భాషని నేర్చుకునేటప్పుడు మెదడులోని ఎడమ అర్ధభాగం(లెఫ్ట్ హెమిస్ఫియర్) చురుగ్గా ఉంటుందట. సంగీతం నేర్చుకునే పిల్లల్లో ఆ చురుకుదనం మిగతావాళ్లకన్నా ఎక్కువగా ఉందని ఈ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాదు, అక్షరాలని కూడుకుంటూ మెల్లగా పైకి చదివే దశ నుంచి పెద్దవాళ్లలా వేగంగా మనసులోనే చదివే దశకి తొందరగా చేరుకుంటున్నారనీ వివరిస్తున్నారు!



పండ్లతో ఊపిరితిత్తులు క్షేమం!

ఓ అధ్యయనం ప్రకారం... ప్రపంచంలోని 90 శాతం మంది రోజూ ఏదోరకంగా వాయుకాలుష్యానికి గురవుతున్నారట. ఇలా కలుషిత గాలిని పీల్చడం వల్ల ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ని తీసుకునే సామర్థ్యం కూడా తగ్గుతూ ఉంటుంది. అవి గాలిని పీల్చే సామర్థ్యాన్ని ఫోర్స్‌డ్ ఎక్స్‌పైరటరీ వాల్యూమ్(ఎఫ్‌ఈవీ1) అని సూచిస్తారు. సాధారణంగా మనం ఒకసారి పీలిస్తే 500ఎం.ఎల్ గాలి ఊపిరితిత్తుల్లోకి వెళుతుంది. కాలుష్య వాతావరణంలో ఉన్నవాళ్లలోనైతే అందులో 78.2 ఎం.ఎల్. వరకూ తగ్గుతుందట. చూడ్డానికి ఇది చాలా తక్కువ మోతాదుగానే అనిపిస్తుంది కానీ... మన శరీరానికి అందే ప్రాణవాయువు పరంగా గమనిస్తే 78.2 ఎం.ఎల్. తగ్గడం అన్నది సమస్యే. దీన్ని ఆహారంతో ఎలా నిరోధించవచ్చన్న అంశంపైన తాజాగా ఓ పరిశోధన నిర్వహించారు యూకేకి చెందిన లెస్టా వర్సిటీ శాస్త్రవేత్తలు. తాజా పండ్లు దీన్ని సమర్థంగా ఎదుర్కొంటున్నాయని తేల్చారు. కాలుష్య వాతావరణంలో ఉన్నా రోజూ పండ్లు తీసుకునే వాళ్లలో... ఊపిరితిత్తులు గాలిని తీసుకునే మోతాదు కేవలం 54 ఎం.ఎల్. మాత్రమే తగ్గుతోందని వివరించారు. దాదాపు రెండు లక్షలమంది ప్రజలపైన పరిశోధన నిర్వహించి ఈ విషయాన్ని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. కాలుష్య ప్రభావాన్ని తప్పించుకోవాలంటే రోజూ కనీసం 420 గ్రాముల వరకైనా పండ్లని తీసుకోవాలని సూచిస్తున్నారు.



అనుబంధాలు అప్పుడే మొదలవ్వాలి!

'యుక్తవయసులోనే చక్కటి అనుబంధాలని పెంచుకోండి.... అది మీరు వృద్ధాప్య సమస్యల బారినపడకుండా చూసుకుంటుంది' అని చెబుతున్నారు అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయం పరిశోధకులు! ఈ శాస్త్రవేత్తలు అరవైఏళ్లు దాటిన 21 వేలమంది వృద్ధుల డీఎన్‌ఏలని ఇటీవల పరిశీలించారు. ముఖ్యంగా వాళ్లలో వృద్ధాప్య లక్షణాలని సూచించే జన్యువ్యక్తీకరణ గడియారాలని (ఎపిజెనిటిక్ క్లాక్స్) విశ్లేషించారు. కొందరిలో ఇవి చాలా తక్కువగానే ఉన్నాయని గమనించారు. వాళ్లెవరూ అంటే... వృద్ధాప్యం వచ్చినా నడివయసు వారిలో ఉన్నంత హుషారుగా ఉండటమే కాక... తీవ్రఆరోగ్య సమస్యలేవీ లేనివాళ్లన్నమాట! వీళ్లందరూ అటు వ్యక్తిగతంగానూ, ఇటు సామాజికంగానూ చక్కటి అనుబంధాలని నెరపుతున్నవాళ్లై ఉండటాన్ని చూశారు. పైగా, ఈ వ్యక్తులందరూ మొదట్లో అందరికీ దూరంగా ఉండి... ఆ తర్వాత అనుబంధాలని పెంచుకున్న వాళ్లు కాదట. యుక్తవయసు నుంచే చక్కటి స్నేహశీలత కలిగి ఉన్నవాళ్లట. 'వీళ్లందరూ బాల్యస్నేహాలనీ కాపాడుకున్నవాళ్లు, జీవితభాగస్వాములతో పెద్ద సమస్యలేవీ లేనివాళ్లు, చుట్టూ ఉన్నవాళ్లతోనూ ఆత్మీయంగా ఉన్న వాళ్లు' అని చెబుతున్నారీ శాస్త్రవేత్తలు.



క్యాన్సర్‌పైన ఆస్ప్రిన్ అస్త్రం!

ఆస్ప్రిన్... మెడికల్ షాపుల్లో పది రూపాయలకి దొరికే నొప్పి మందు! ఇదివరకే గుండెపోటు వచ్చినవాళ్లు తక్షణం వాడటానికి ఇది ఉపయోగపడుతోంది. తాజాగా- ఈ మందు పెద్దపేగు(కొలొరెక్టల్) క్యాన్సర్ మళ్లీ రాకుండా కాపాడుతోందని కూడా తేల్చారు స్వీడన్‌లోని కరోలీన్‌స్కా వర్సిటీ శాస్త్రవేత్తలు. ప్రపంచంలో ఏటా 20 లక్షలమంది ఈ రకం క్యాన్సర్ బారిన పడుతున్నారట. చికిత్స తర్వాత వీళ్లలో 20 నుంచీ 40 శాతం మందికి క్యాన్సర్ తిరగబెట్టి... ప్రాణాంతకంగా మారుతోందని చెబుతారు. అలాంటి వాళ్లకి ముందుగానే ఆస్ప్రిన్ ఇవ్వడం ద్వారా సమస్య తిరిగి రాకుండా అడ్డుకోవచ్చంటున్నారీ శాస్త్రవేత్తలు. మామూలుగా మన శరీరంలోని కణాలు ఒకదానిపైన ఒకటి ఆధారపడే ఎదుగుతాయి. అలా ఎదగడానికి పీ13కే అనే గొలుసు ప్రక్రియ(చెయిన్ రియాక్షన్) దోహదపడుతుంది. అందులో చోటుచేసుకునే విపరీత మార్పులు(మ్యుటేషన్) కొలొరెక్టల్ క్యాన్సర్ తిరగబెట్టడానికి కారణమంటారు శాస్త్రవేత్తలు. ఆస్ప్రిన్ ఆ మ్యుటేషన్‌ని సమర్థంగా అడ్డుకోగలుగుతోందని తేల్చారు కరోలీన్‌స్కా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.



సౌండ్ ప్రూఫ్ చెట్లు వచ్చేస్తున్నాయ్!



నగరాల్లో హారన్ల మోతలేని... ప్రశాంతమైన రోడ్లని ఊహించుకోగలరా? పక్కింట్లో బోరు వేస్తున్నా, ఇల్లు కడుతూ శ్లాబ్‌పని చేస్తున్నా, థౌజండ్‌వాలా టపాసులు వరుసపెట్టి పేలుస్తున్నా, మైకులు హోరెత్తిపోతున్నా... ఆ శబ్దాలు మనవరకూ రాకుండా ఉంటాయంటే నమ్ముతారా? 'అబ్బ... చెవుల్లో అమృతం పోసినట్టుగా ఉంది. అదెలాగో చెబుదురూ' అంటారు కదా. అవును, మీరు విన్నది నిజమే, త్వరలో శ్రుతిమించిన శబ్దాల పనిపట్టే 'సౌండ్‌ప్రూఫ్ చెట్లు' వస్తున్నాయి...



కనిపించని శత్రువుతో పోరాటం కష్టం... శబ్ద కాలుష్యం కూడా అలాంటిదే! ట్రాఫిక్‌లో పిచ్చెక్కించే రణగొణ ధ్వనులూ 'ఠంగు... ఠంగు'మని నెత్తిమీదే కొడుతున్నట్టుండే నిర్మాణ పనులూ... మన చెవులనే కాదు గుండెనీ చిక్కుల్లో పడేస్తాయి. హద్దుమీరిన శబ్దాలు ఒత్తిడిని కలిగించే హార్మోన్లని విడుదల చేస్తాయి. అవే తర్వాత గుండెజబ్బులకూ, చిన్నారుల్లో కాగ్నిటివ్ స్కిల్స్ లోపానికీ దారితీస్తాయని వైద్యులు అంటున్నారు. అందుకే మరి, ఫ్రాన్స్‌లాంటి దేశాలు ధ్వని కాలుష్యాన్ని అడ్డుకునే 'నాయిస్ బ్యారియర్ల'మీదా, 'ఎకోస్టిక్ వాల్స్'పైనా ఏటా రూ.15లక్షల కోట్లు ఖర్చుపెడుతున్నాయి. దాదాపు ప్రపంచ దేశాలన్నింటిదీ ఇదే సమస్య. లక్షలూ కోట్లూ ఖర్చుపెట్టి శబ్దాలు ఎక్కువగా వినిపించే హైవేల దగ్గరా, రైల్వేలైన్ల వెంటా, మెట్రో మార్గాల్లో, ఎయిర్‌పోర్టుల వద్దా ఈ కాంక్రీట్ నాయిస్ బారియర్లని పెడుతున్నాయి. రోడ్డుకి అటూఇటూ పిట్టగోడల మాదిరిగా ఉండే వీటిని మీరూ చూసే ఉంటారు. అంతెందుకు... ముంబయి- అహ్మదాబాద్ రూట్లో రానున్న బుల్లెట్ ట్రెయిన్ శబ్దాన్ని తగ్గించేందుకు రెండు లక్షల బారియర్లని ఏర్పాటు చేశారు. ఒక్కోటి పదివేల రూపాయల పైమాటే. ఇంతా ఖర్చు పెట్టి వీటిని పెట్టినా, పెద్దగా లాభం ఉండట్లేదట. ఎందుకంటే ఇవి ఖర్చుతో కూడుకున్నవేకాదు... అవి శబ్దాన్ని పూర్తిగా గ్రహించవు, దారిమళ్లిస్తాయి అంతే! అంటే అదో తాత్కాలిక పరిష్కారం అన్నమాట. కానీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వచ్చినవే 'సౌండ్ ప్రూఫ్' చెట్లు.

జెనెటికల్లీ ఇంజినీర్డ్ చెట్లు ఇవి...

చెట్లు కార్బన్‌డైఆక్సైడ్‌ని పీల్చుకుని, కాలుష్యాన్ని తగ్గిస్తాయనే తెలుసు మనకి. కానీ చెట్లకున్న మరో ప్రత్యేకత అధిక శబ్దాలని గ్రహించడం. తనపైన ఆధారపడ్డ పక్షులకూ, ఇతర జీవజాతికీ ఏ ఇబ్బందీ కలగకుండా ఉండేందుకే చెట్లు ఇలా చేస్తాయట. అయితే అన్ని చెట్లకూ ఈ శక్తి ఉండదు. ఓక్, వేప, రావి, మామిడి, గుల్‌మొహర్, టేకు... వంటి కొన్ని చెట్లు- అందులోనూ ఎక్కువ వయసున్నవి మాత్రమే ఐదు డెసిబుల్స్ వరకూ ధ్వనులను గ్రహిస్తాయట. చెట్లకున్న ఈ సహజమైన గుణానికే మరికొన్ని మార్పులు చేసి జర్మనీ శాస్త్రవేత్తలు ఈ 'సౌండ్‌ప్రూఫ్' చెట్లను రూపొందించారు. సాధారణంగా ఆకులు వెడల్పుగా ఉండీ, బెరడు గరుకుగా, మందంగా ఉండే చెట్లు మాత్రమే శబ్దాలను ఎక్కువగా గ్రహిస్తాయి. బయో- ఇంజినీరింగ్ టెక్నాలజీ సాయంతో పై లక్షణాలున్న ఓక్, యురోపియన్ హార్న్‌బీమ్, నిమ్మ వంటి చెట్ల ఆకులూ, బెరడు నిర్మాణంలో మార్పులు చేసి ఈ సౌండ్ ప్రూఫ్ చెట్లను ఆవిష్కరించారు.





ఏడాదంతా పచ్చగా ఉండే ఈ చెట్ల వేర్లు నేలని గుల్లబార్చి ఒక స్పాంజ్‌లా శబ్దాలని గ్రహించేలా చేస్తాయి. వీటిని బెర్లిన్‌లోని రైల్వేలైన్లకి ఇరువైపులా, హైవేలా దగ్గరా, ఎయిర్‌పోర్టుల దగ్గరా, ట్రాఫిక్ అధికంగా ఉండే చోట్లా, పారిశ్రామిక ప్రాంతాల్లో నాటారట. ఇవి నగరాల్లో వెలువడుతున్న శబ్దాలని 20 డెసిబుల్స్ వరకూ, రోడ్ల దగ్గర శబ్దాలని 40శాతం వరకూ తగ్గిస్తున్నాయని జర్మనీ శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఈ కాంక్రీట్ మొలకెత్తుతుంది...

బయట శబ్దాల సంగతి సరే... ఇంట్లోనూ, ఆఫీసుల్లోనూ, పరిశ్రమల్లోనూ కూడా విసిగించే శబ్దాలు ఉంటాయిగా! వాటికీ 'నాచు' రూపంలో ఓ పరిష్కారం దొరికింది. 'బన్ మాస్' అనే రకం నాచు ఇండోర్ సౌండ్ పొల్యూషన్‌ని 90శాతం తగ్గిస్తుందట. అందుకే రెస్టరంట్లూ, ఆఫీసుల్లో ఈరకం నాచుతో అందమైన 'మాస్‌పానెల్స్'ని తయారుచేసి పెడుతున్నారు. అవి ఇటు ఆఫీసులకి అందాన్ని తీసుకొస్తూనే, అటు శబ్ద కాలుష్యాన్నీ తగ్గిస్తున్నాయి. నెదర్లాండ్స్‌కి చెందిన 'రెస్‌పైర్' అనే స్టార్టప్ సంస్థ ఏకంగా 'గ్రీన్ కాంక్రీట్'నే ఆవిష్కరించింది. దీన్ని మినరల్స్‌తో తయారుచేశారు. ఈ కాంక్రీట్‌తో నిర్మించిన భవనాలు నాచు పెరగడానికి అనుకూలంగా ఉంటాయి. గాల్లోని తేమతోనే ఇవి బతికేస్తాయి. అటు భవనాలని పచ్చగా ఆహ్లాదకరంగా ఉంచడంతోపాటు, బయటి శబ్దాలని లోపలికి రాకుండా అడ్డుకుంటున్నాయి. అలాగే 'సూపర్ ఉడ్' పేరుతో స్టీల్ అంత దృఢంగా ఉండే చెక్కని మేరీల్యాండ్ శాస్త్రవేత్తలు తయారుచేశారు. దీన్ని నిర్మాణాల్లో వాడితే ఇంటిని సౌండ్ ప్రూఫ్‌గా మార్చేయొచ్చట. మొత్తం మీద వీటితో పచ్చదనంతోపాటు ప్రశాంతత కూడా దొరుకుతుందన్నమాట! ★

తాళికట్టు శుభవేళ...
డిజిటల్ హంగుల హేల!

పెళ్లంటే... పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలు, మూడు ముళ్లు, ఏడు అడుగులు... ఇది ఒకప్పటి మాట. పెళ్లంటే... రోబో ఫొటోగ్రాఫర్లు, వర్చువల్ షూట్లు, ఏఐ డీజేలు, డ్రోన్ లైట్లు, ట్యాబ్లెట్ విందులు, హోలోగ్రాఫిక్ స్వాగతాలు, ఎల్ఈడీ వాల్స్... ఇది ఇప్పటి మాట. ఈతరం హైటెక్ వివాహ వేడుకల్లో టెక్నాలజీ చూపిస్తున్న ఆ విచిత్ర విశేషాలేంటో చూద్దామా!





రోబో తీసిన ఫొటో!

చీరా, నగలతో చక్కగా ముస్తాబై పెళ్లికి వెళితే, అక్కడ ఓ రెండు ఫొటోలైనా తీసుకోవాలని సరదా పడుతుంటారు అమ్మాయిలు. వేదిక మీదా, విందు భోజనాల్లో స్నేహితులూ, బంధువులతో కలిసి కుదిరినప్పుడల్లా సెల్ఫీలూ తీసుకుంటారు. లేదంటే ఎవరినైనా అడిగి ఫొటోలు తీయించుకుంటారు. కానీ ఎవరి సాయం లేకుండానే- అతిథులందరినీ ఒకే ఫ్రేమ్‌లో, సూపర్ పోజుల్లో ఫొటోల్ని తీసిపెట్టడానికి ఈమధ్య రోబో ఫొటోగ్రాఫర్లు రంగంలోకి దిగారు. చక్కటి చీరనో, లెహెంగానో వేసుకుని, మెడలో ఆభరణాలు అలంకరించుకుని మరీ ఈ రోబో ఫొటోగ్రాఫర్లు వేడుకలో అటూ ఇటూ తిరిగేస్తుంటారు. వాళ్ల ముందు నిలబడి బటన్ నొక్కగానే 'క్లిక్ క్లిక్' మంటూ ఫొటోలు తీస్తూ అప్పటికప్పుడు ఫొటో ఫ్రేములన్నీ చేసి పెడతారు. కృత్రిమ మేధతో పనిచేసే ఈ నయా రోబోలతో- సిగ్గుపడకుండా నవ్వుతూ ఎంచక్కా ఫొటోల్నీ, వీడియోల్నీ తీసుకోవచ్చన్నమాట. ఫంక్షన్‌కి ప్రత్యేక ఆకర్షణను తేవడానికి చాలా ప్రాంతాల్లో ఇప్పటికే ఈ రోబో ఫొటోగ్రాఫర్లను ఈవెంట్స్‌లో భాగం చేస్తున్నారు!



వీఆర్ పెళ్లి!

అనుకోని పనులొచ్చి చిన్ననాటి స్నేహితుడి పెళ్లికి వెళ్లలేకపోతే ఆ బాధ ఎప్పటికీ అలాగే ఉండిపోతుంది. పెళ్లి ఎలా జరిగిందో తర్వాత ఎవరు ఎంత వర్ణించి చెప్పినా తృప్తిగా అనిపించదు. అలాంటప్పుడే 'వర్చువల్ రియాలిటీ వెడ్డింగ్ ఎక్స్‌పీరియన్స్'తో కార్యక్రమాన్ని ఉన్నచోటు నుంచే చూడొచ్చు. వేడుక మొత్తం కళ్ల ముందే జరిగినట్టుగా అనిపిస్తుంది. మామూలు ఫొటోగ్రఫీతోపాటు ఈమధ్య పెళ్లిళ్లలో 360 డిగ్రీల్లో ఈ వీఆర్ వెడ్డింగ్ షూట్‌నీ ప్రత్యేకంగా చేస్తున్నారు. ఆ వీడియోని వీఆర్ హెడ్‌సెట్ ద్వారా చూస్తే పెళ్లి కళ అంతా కనిపించేస్తుంది, మనం ఆ పెళ్లి పందిట్లో ఉన్న అనుభూతే కలుగుతుంది!





వర్చువల్ సుస్వాగతం!

వధూవరుల తల్లిదండ్రులు వేదిక మీద పెళ్లి తంతుల్లో నిమగ్నమై ఉన్నారు. కల్యాణమండపంలోకి అతిథుల్ని స్వాగతం పలుకుతూ 'రండి... మా ఆతిథ్యాన్ని స్వీకరించి, కొత్తజంటను మనసారా ఆశీర్వదించండి' అంటూ ద్వారం దగ్గరా నిలబడి నమస్కరిస్తున్నారు. ఒకేసమయంలో అక్కడా ఉన్నారు, ఇక్కడా ఉన్నారు... అది ఎలాగో ఆశ్చర్యంగా ఉందా? మరేం లేదు, బయట 'వర్చువల్ హోలోగ్రాఫిక్ డిస్‌ప్లే వెల్‌కమ్'ను ఏర్పాటు చేశారు. వివాహ వేడుకలో ఎలాంటి లోటూ లేకుండా చేయడానికే ఈ వర్చువల్ వెల్‌కమ్ టెక్నాలజీని తెచ్చారు. ఎక్కడో ఉన్న వ్యక్తుల్ని మన ముందే ఉన్న అనుభూతినిచ్చే హోలోగ్రాఫిక్ సాంకేతికత ఇది. అక్కడ మనుషులు ఉన్నట్టే, వాళ్లు నిజంగా మాట్లాడుతున్నట్టుగానే భ్రమింపచేస్తుంది ఇది. వివిధ భాషల్లో... విడివిడిగా, కుటుంబ సభ్యులందరి చిత్రాలతోనూ ఈ వెరైటీ స్వాగతం ట్రెండ్‌ను ఫాలో అవ్వొచ్చు!





బటన్ నొక్కితే పెళ్లి భోజనం!

ఇదివరకు వేడుకల్లో అరిటాకులు వేసి భోజనాలు పెట్టేవాళ్లు. కూర్చున్న దగ్గరికే వంటకాల్ని తెచ్చి వడ్డించేవాళ్లు. ఆ తర్వాత వంటలన్నింటినీ టేబుల్ మీద ఉంచితే, ఎవరికి నచ్చింది వాళ్లు పెట్టుకుని తినే బఫె పద్ధతి వచ్చింది. కానీ మళ్లీ ఇప్పుడు కూర్చుని తినే పాత విధానమే ట్రెండ్ అవుతోంది. అంతేకాదు, టెక్నాలజీని చేర్చుకుని ఇంకాస్త వీలునూ తెచ్చింది. అతిథులు- పెళ్లి కార్యక్రమాల్ని చూస్తూ, స్నేహితులతో మాట్లాడుతూ అన్ని ఐటమ్స్‌నీ పూర్తిగా ఎంజాయ్ చేయలేరనే విషయాన్ని గమనించినట్టున్నారు కొందరు వెడ్డింగ్ ప్లానర్స్. 'మొబైల్ ట్యాబ్లెట్ బేస్డ్ ఫుడ్ ఆర్డరింగ్ సర్వీస్'ను మొదలుపెట్టారు. కూర్చున్న దగ్గరే టేబుల్ మీద ట్యాబ్ ఉంటుంది. విందులోని పదార్థాల జాబితా అంతా అందులో కనిపిస్తుంది. ఎంచక్కా వాటిల్లో మనకు కావాల్సినదాన్ని నొక్కితే చాలు, టేబుల్ దగ్గరికే ఫుడ్ తెచ్చిపెడతారు. హాయిగా కబుర్లు చెప్పుకుంటూనే తినొచ్చు. పైగా ఒకేసారి కాకుండా కాస్త గ్యాప్ తీసుకుంటూ అన్ని రకాల పదార్థాల్నీ రుచి చూడొచ్చు.






వేడుక ఆకాశాన్నీ తాకింది!

తన ప్రేమను తెలపడానికి ఆకాశాన్నీ కాన్వాసుగా చేసుకుంటున్నారు ఈతరం పెళ్లి కొడుకులు. రాత్రిపూట జరిగే పెళ్లి వేడుకల్లో అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తూనే, రంగురంగుల లైట్ల అమరికతో తమ మనసులోని మాటల్ని చెబుతున్నారు. ఈ మధ్య బాగా ఫేమస్ అయిన ఈ డ్రోన్ షోలు ఇప్పుడు వివాహ వేడుకల్లోనూ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అవుతున్నాయి. వధూవరుల చిత్రాలూ, పెళ్లి థీమ్ బొమ్మలూ, అమ్మాయిఅబ్బాయిల పేర్ల ఆకారాల్లో ఈ ప్రదర్శనలు చేస్తున్నారు. కాంతులీనే కల్యాణ మండపాల అలంకరణ ఒక ఎత్తయితే, అల్లంత దూరాన నింగిలో డ్రోన్ లైట్ల ధగధగలు మరొక ఎత్తనే చెప్పాలి!





దూరమైన ఆత్మీయులూ వస్తారు!



చిన్నప్పుడే దూరమైన నాన్న- కూతురిని దీవించడానికి పెళ్లి వేదిక మీదకు దిగి వస్తే, ప్రమాదవశాత్తూ చనిపోయిన అక్క- తమ్ముడి వివాహంలో నవ్వుతూ కనిపిస్తే... ఇంట్లోవాళ్ల కళ్లల్లో అనంతమైన దుఃఖంతోపాటు సంభ్రమాశ్చర్యాల్నీ చూడొచ్చు. అంగరంగవైభవంగా వేడుక జరుగుతున్నా దూరమైన ఆత్మీయుల జ్ఞాపకాలు చుట్టుముడితే కాస్త కష్టంగానే ఉంటుంది ఎవరికైనా. ఆ చిన్న లోటునూ భర్తీ చేయడానికి ఏఐ టెక్నాలజీతో మరపురాని 'మెమరీస్ వీడియో'ల్ని సృష్టిస్తున్నారు ఫొటోగ్రాఫర్లు. కుటుంబ సభ్యులతో లేనివారి చిత్రాన్ని జత చేస్తూ రకరకాల వీడియోల్ని చేసి వేడుకలో ప్రదర్శిస్తున్నారు. ఆ మనుషులు నిజంగా స్వర్గం నుంచి దిగి వచ్చినట్టు, ప్రేమగా మాట్లాడినట్టు, ఆనందంగా నవ్వినట్టు, కొత్తజంటను ఆశీర్వదించినట్టు... రకరకాల అనుభూతులు పంచుతాయా వీడియోలన్నీ. ప్రతి ఒక్కరి మనసునూ కదిలించే ఆ దృశ్యాలు పెళ్లిళ్లలో ఓ మధుర జ్ఞాపకం అవుతున్నాయి!

అలంకరణ నుంచి డీజే వరకూ...

త్రీడీ ఫొటోలతో ఆహ్వానం పలికే శుభలేఖలోనూ మెప్పించిన టెక్నాలజీ- వేడుక మొత్తంలోనూ ఆకట్టుకుంటోంది. పూల అలంకరణలను మించిన ఎల్ఈడీ వెడ్డింగ్ వీడియో వాల్స్- కల్యాణ మండపానికి కొత్త కాంతులవుతున్నాయి. డ్యాన్స్‌కు తగ్గట్టు మారిపోయే ఇంటరాక్టివ్ డ్యాన్స్ ఫ్లోర్లూ సంగీత్ కార్యక్రమాల్లో తెగ అలరిస్తున్నాయి.

ఇంకా అతిథుల మూడ్‌కు తగ్గట్టు మ్యూజిక్‌ను మార్చే ఏఐ డీజే, రంగులు మారే లైట్ల సెట్లూ చాలానే వచ్చాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పెళ్లి ఫొటోలూ, వీడియోల్ని చూపించే రిటర్న్ గిఫ్ట్‌లూ హల్‌చల్ చేస్తున్నాయి. అంతేకాదు, కొన్ని కంపెనీలు వెడ్డింగ్ ఏఐ చాట్‌బాట్స్ సాయంతో పూర్తిగా వివాహ మహోత్సవాన్నే జరుపుతున్నాయి. అతిథుల పిలుపులు మొదలు మండపం చిరునామా వరకూ అన్ని వివరాల్నీ వాటిల్లో ఉంచుతూ ఓ ప్రణాళికబద్ధంగా కార్యక్రమాన్ని చేస్తున్నాయి!





ఇద్దరి నేపథ్యాలే కాదు చదువులూ వేరు. వీళ్లు... తీరిక సమయంలో హాస్టల్ గదిలో సరదాగా చేసిన డ్రోన్ల తయారీ... జాతీయస్థాయిలో గుర్తింపునే కాదు భారత సైన్యానికి పనిచేసే అవకాశాన్నీ తెచ్చి పెట్టింది. ఓ వైపు చదువు కుంటూనే 'అపోలియాన్ డైనమిక్స్' పేరుతో వ్యాపారం దిశగా అడుగులు వేస్తున్న ఆ విద్యార్థులే హైదరాబాద్ బిట్స్ పిలానీకి చెందిన శౌర్య చౌధురి, జయంత్ ఖత్రీ.



సైన్యానికి డ్రోన్లు తయారుచేస్తున్నారు!



బిట్స్ పిలానీ - హైదరాబాద్... ఎన్నో కొత్త ఆలోచనలకూ, మరెన్నో ప్రయోగాలకూ నాంది పలికే వేదిక. అలాంటి చోట విద్యార్థులుగా చేరారు శౌర్య చౌధురి, జయంత్ ఖత్రీ. ఇద్దరికీ తొలి ఏడాదే స్నేహం కుదిరింది- అదీ అక్కడ విద్యార్థులు నడిపే రోబోటిక్స్ క్లబ్‌లో. జయంత్ స్వస్థలం అజ్మీర్. మెకానికల్ ఇంజినీరింగ్‌తోపాటు ఎకనమిక్స్ చదువుతున్నాడు. శౌర్యది కోల్‌కతా. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌తోపాటు ఫిజిక్స్ చదివేందుకు ఇక్కడకు వచ్చాడు. జయంత్‌కి టెరస్ట్రియల్ రోబోటిక్స్ అంటే ఇష్టం. అప్పటికే స్మార్ట్ కళ్లద్దాలను తయారు చేసిన అనుభవమూ ఉంది. ఇక, శౌర్యకు విమానాల రీమోడలింగ్, డ్రోన్ల తయారీ అంటే విపరీతమైన ఆసక్తి. వాతావరణ మార్పుల్ని పసిగట్టే డ్రోన్‌ని అప్పటికే తయారుచేశాడు కూడా. అలా ఇద్దరూ కలిసి డ్రోన్లకు సంబంధించి ఏదైనా ప్రయోగం చేయాలనుకున్నారట. దాంతో ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు సాయంత్రాలు తమ హాస్టల్‌గదిలోనే డ్రోన్ తయారీపైన దృష్టిపెట్టారు.

కాస్త కష్టమైనా...

ఒక పరికరం తయారుచేయాలనుకున్నప్పుడు టెక్నాలజీ మాత్రమే తెలిస్తే సరిపోదు. అది ఏ లోపం లేకుండా సమర్థంగా పని చేసేలా చూడాలంటే ఎంతో ఓపిక అవసరం. 'డ్రోన్ తయారీకోసం రోజూ గంటలతరబడి - కొన్నిసార్లు రాత్రంతా కూర్చునేవాళ్లం. డ్రోన్‌ను భాగాలవారీగా తయారుచేస్తూ త్రీడీ ప్రింటర్‌లో ప్రింట్ తీసుకునేవాళ్లం. ఎదురైన లోపాలను సరిదిద్దుకుంటూ కొత్త రూపాన్ని ఇచ్చేవాళ్లం. ఆ తర్వాత అది ఎంత వేగంగా వెళ్తుందనేదీ గమనించుకునేందుకు పలు డ్రోన్ రేసుల్లో పాల్గొనేవాళ్లం. అలా దాదాపు ఆరవైరోజులు కష్టపడితే మేం అనుకున్నట్లుగా ఓ ప్రొటోటైప్‌ను గంటకు మూడు వందల కిలోమీటర్ల వేగంతో ఎగిరేలా, పేలోడ్‌ను తీసుకెళ్లేలా, రాడార్ వ్యవస్థల నుంచి తప్పించుకుని తిరిగేలా... తయారు చేయగలిగాం. ఓ కొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చామని చాలా సంతోషించాం. అందుకే మా ప్రయత్నాన్ని ఆర్మీ దృష్టికి తీసుకెళ్తే బాగుంటుందని అనిపించింది. కానీ అక్కడి వరకూ చేరుకునేందుకు ఎన్నో రోజులు ఎదురుచూశాం' అంటూ వివరిస్తారు ఈ మిత్రద్వయం. ఈ మిత్రులిద్దరూ డ్రోన్ తయారీ మొత్తం సొంత ఖర్చుతోనే చేయడంతో ఫండింగ్ కోసం ప్రయత్నించలేదు. కేవలం తమ లింక్డిన్ అకౌంట్లలో డ్రోన్ గురించి తెలియజేశారు. అదే సమయంలో సైన్యానికి సంబంధించి ఏ ఈమెయిల్‌ఐడీ కనిపించినా తమ గురించి తెలియజేస్తూ, డ్రోన్ ఫొటోలు పెట్టి ఈమెయిళ్లు పంపించేవారట. రోజులు గడుస్తున్నా ఒక్క సమాధానం కూడా రాలేదట. తమ ప్రయత్నం వృథా అయ్యిందని బాధపడుతున్న సమయంలో 'మీ డ్రోన్ ఎలా పనిచేస్తుందనేది మీరు వచ్చి చూపిస్తారా...' అంటూ చండీగఢ్‌కు చెందిన ఓ ఆర్మీ కల్నల్ నుంచి వచ్చిన సమాధానం వారిలో కొత్త ఆశలు పెంచింది. అంతే, డ్రోన్‌ను పట్టుకుని చండీగఢ్‌కు ప్రయాణమయ్యారు. ఆ కల్నల్‌తోపాటు ఇతర సైనికాధికారుల సమక్షంలో డ్రోన్ ఎలా పనిచేస్తుందో చూపించారు. అంతా మౌనంగా చూశారు. చాలా తక్కువ సమయంలోనే వివిధ ప్రాంతాల్లోని ఆర్మీ యూనిట్ల నుంచి 'మాకు మీ డ్రోన్లు కావాలి. మేం అడిగినన్ని చేసి పెట్టగలరా' అంటూ ప్రతిపాదన వచ్చింది. అలా 'అపోలియాన్ డైనమిక్స్' సంస్థ ఊపిరి పోసుకోవడంతో ఈ మిత్రులిద్దరూ కలిసి డ్రోన్ల తయారీ స్టార్టప్‌ను పెట్టారు.

అదే ప్రత్యేకత...

సాధారణంగా ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించిన కాంపోనెంట్లు చైనాలోనే ఎక్కువగా దొరుకుతాయి. అయితే మన భారత్ మాత్రం వాటి వినియోగాన్ని తగ్గించి, ఇండియాలో దొరికే కాంపోనెంట్లను యాభైశాతం వరకూ వాడాలనే నిబంధనను తీసుకొచ్చింది. జయంత్, శౌర్యలిద్దరూ దాన్ని అనుసరించే ఈ డ్రోన్లను తయారు చేశారు. ఇవి గంటకు మూడు వందల కిలోమీటర్ల వేగంతో ఎగురుతాయి. సాధారణ డ్రోన్లతో పోలిస్తే వీటి వేగం అయిదురెట్లు ఎక్కువ అన్నమాట. అదే సమయంలో కేజీ వరకూ పేలోడ్‌నూ మోసుకెళ్తాయి. రాడార్ వ్యవస్థకు అందవు. కొండలు, అడవులు... ఇలా ఎక్కడైనా విహరించగలవు. అన్నింటికీ మించి ఓ స్మార్ట్‌ఫోన్‌ను వాడినంత ఈజీగా దీన్ని ఉపయోగించడం సైన్యాన్ని ఆకర్షించింది. 'ప్రారంభంలో మేం పెట్టిన పెట్టుబడి లక్షల్లోనే ఉన్నా... చాలా తక్కువ సమయంలోనే మా సంస్థ విలువ పాతిక కోట్లకు చేరుకుంది. ఇప్పుడు జమ్మూ, అసోం, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్, హరియాణా, చండీగఢ్... ఇలా సైన్యానికి చెందిన పలు రెజిమెంట్లకు మా డ్రోన్లను తయారుచేసి ఇస్తున్నాం. మా ఆలోచన వ్యాపారమార్గంగా మారే క్రమంలో బిట్స్ పిలానీలోని రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ విభాగానికి డీన్ అయిన ప్రొఫెసర్ సంకేత్ గోయల్ సహకారమూ ఎంతో ఉంది...' అంటూ వివరిస్తారీ మిత్రులు. ★

అచ్చు గుద్దినట్టు... మీలాంటి ఓ బొమ్మ..!





ఒకప్పుడు నలుపు-తెలుపు ఫొటోల ట్రెండ్ నడిచింది. తర్వాత కలర్ ఫొటోల హంగామా మొదలయింది. ఆ తర్వాత వచ్చిన సెల్ఫీల సరదా తెలిసిందే! ఈ ట్రెండ్‌కి కొనసాగింపుగా వస్తున్నవే రియల్ త్రీడీ స్టాచ్యూలు...







చిన్నప్పుడు ఆటల్లో 'స్టాచ్యూ...' అంటే కాసేపు ఎలా ఉన్నవాళ్లం అలా బొమ్మలా ఉండిపోయే వాళ్లం... గుర్తుందా? జీవితంలో కొన్ని అపురూపమైన క్షణాలు కూడా 'అలానే ఫ్రీజ్ అయినట్టుగా ఉండిపోతే ఎంత బాగుండు' అనిపించినా, అది అయ్యే పనికాదని మనకీ తెలుసు. కానీ ఇప్పుడలాంటి జ్ఞాపకాలని సజీవంగా దాచిపెట్టుకునేందుకు వీలుగా 'రియల్ త్రీడీ స్టాచ్యూలు' వచ్చేశాయి. చిన్ననాటి అల్లరినీ, యౌవనపు దూకుడునీ... తిరిగి తలుచుకోవడానికి ఫొటోలూ, వీడియోలూ ఉంటాయి. కానీ ఆ క్షణాలని తడిమిచూసుకోవాలంటే మాత్రం ఈ మినీ రియల్ స్టాచ్యూలు ఉండాల్సిందే.

అచ్చం మనలానే...

వీటిని చూస్తే... మనల్ని మనమే అద్దంలో చూసుకున్నంత స్పష్టంగా ఉంటాయి. అందుకే వీటిని మినీ రియల్స్ అనీ, త్రీడీ- ట్విన్స్ అనీ, షేపీఫైలనీ అంటున్నారు. అంత గొప్పగా ఉంటాయంటే... ఈ బొమ్మల తయారీకి చాలా సమయం పడుతుందనుకుంటే పొరపాటు. పది సెకన్లు కెమెరా ముందు ఉండి, కావాల్సిన పోజు ఇస్తే చాలు... పావుగంటలో అచ్చంగా మీలానే ఉండే 'త్రీడీ ట్విన్' తయారైపోతుంది. మనం ధరించిన దుస్తుల్లోని పోగులూ, చెదిరిన తల వెంట్రుకలనీ కూడా అలానే యథాతథంగా బొమ్మరూపంలోకి తీసుకురావడమే వీటి ప్రత్యేకత. నాణ్యమైన కెమెరాలకు, శక్తిమంతమైన స్కానర్లు కూడా తోడై 0.1 మి.మీ మందంలో ఉండే వస్తువులని కూడా సూక్ష్మంగా స్కాన్ చేస్తాయట. అందుకే ఈ బొమ్మల్లో అంత స్పష్టత ఉంటుంది మరి. అలాగే వీటి తయారీలో రెజిన్‌ని వాడటం వల్ల ఫినిషింగ్ బాగుండి, చూడ్డానికీ ఆకర్షణీయంగా ఉంటున్నాయి. 'అయితే మాకూ ఒక త్రీడీ బొమ్మ కావాలి... ఎలా' అంటారా? వీటికోసం ప్రత్యేకించి సూపర్ మార్కెట్లూ, థీమ్‌పార్కుల్లో 'షేపీఫై', 'రియల్ మి' పేర్లతో బూత్‌లని ఏర్పాటు చేస్తున్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు అద్భుతమైన ఆ క్షణాలు పదిలపరుచుకోవడానికి కొందరూ, భార్యాపిల్లలూ- పెద్దవాళ్లూ- ఇంట్లో పెంచుకుంటున్న పెట్స్‌తో సహా త్రీడీ బొమ్మలుగా మారి మురిసిపోవడానికి కొందరూ వీటిపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. మరికొందరు... ఆత్మీయులతో కలిసి తీసుకున్న ఈ త్రీడీ బొమ్మలని వెడ్డింగ్, బర్త్‌డే కేకుల్లో టాపర్స్‌గా మార్చేస్తున్నారు. ఇంత క్రేజ్ ఉంది కాబట్టే, ఈ త్రీడీ బొమ్మలని తయారుచేసే బూత్‌లకు రద్దీ పెరుగుతోంది మరి. ★











షాపింగ్

ఇల్లంతా వెలుగులు వెదజల్లే పండుగే దీపావళి. ఈ పండుగకు సరికొత్త కాంతులు అద్దడానికి అందమైన ప్రమిదలే కాదు, వెరైటీ కొవ్వొత్తులూ వచ్చేస్తున్నాయి!



కాంతులీనే ఉర్లి!

నీళ్లలో రంగుల పూలను పేర్చుతూ ఉర్లిని తయారుచేసుకుంటారు గృహిణులు. దీపాల వరుసలతోపాటు లివింగ్ రూమ్‌లో ఓ పక్కనో, ద్వారం దగ్గరో వాటిని ఉంచుతుంటారు. కానీ ఆ అందమైన పూలే వెలుగులు కూడా చిమ్మితే కాస్త ఆశ్చర్యమే కదూ! ఇదిగో ఇక్కడున్న 'ఉర్లీ క్యాండిల్స్' సరిగ్గా ఆ పనే చేస్తాయి. పువ్వుల అందాల్ని చూపిస్తూనే, కాంతులీనుతాయి కూడా. 'లోటస్ పాండ్ క్యాండిల్' పేరుతో మార్కెట్లో రకరకాల పూల అమరికతో, చక్కని ఉర్లి పాత్రలతో దొరుకుతున్నాయి ఇవి. రొటీన్ క్యాండిల్స్‌కి బదులు ఈ ఉర్లీ క్యాండిల్‌ని పెట్టుకున్నారంటే- విడిగా పూల అలంకరణ అవసరమూ రాకపోవచ్చు. ఎవరికైనా బహుమతిగా ఇవ్వడానికీ ఈ క్యాండిల్స్ ఎంతగానో బాగుంటాయి.









కొవ్వొత్తే మెరిస్తే...

ఆరిపోయినా కూడా కొన్ని కొవ్వొత్తులు వెలుగుతాయి. ఎందుకంటే అవి 'గ్లో ఇన్ ది డార్క్ క్యాండిల్స్' కాబట్టి. పగటిపూట- షైనీ షైనీగా మెరిసే ఈ కొవ్వొత్తులు చీకట్లో మాత్రం అన్ని రంగుల్లో జిగేల్‌మంటాయి. దీపపు కాంతితో పాటు రంగురంగుల్లో మెరిసే ఈ క్యాండిల్స్ కచ్చితంగా పండుగకు కొత్త కళను తీసుకొస్తాయి!



టపాసులు కాదు!

దీపాలూ, తోరణాలూ, ముగ్గులేనా... పండుగ వాతావరణం ప్రతి దాంట్లోనూ కోరుకుంటారు కొంతమంది. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకునే చిచ్చుబుడ్లూ, రాకెట్లూ, బాంబులూ... తదితర టపాసుల ఆకారాల్లో క్యాండిల్స్‌నూ రూపొందిస్తున్నారు. కాస్త వైవిధ్యంగా వీటిని ఎంచుకున్నారంటే- 'ఇదిగో చూడూ... క్రాకర్స్‌ని ఇంట్లోనే వెలిగిస్తున్నా' అంటూ సరదాగా సన్నిహితుల్ని ఆటపట్టించొచ్చు.



'చిత్రం'గా వెలుగుతాయ్!

ఉదయించే సూర్యుడు, నిండు పున్నమి, జాలువారే జలపాతం... ఇలా ప్రకృతి అందాలన్నింటినీ క్యాండిల్స్ మీదకు తీసుకొస్తూ, ఆర్టిస్టులు త్రీడీ పెయింటింగ్ కొవ్వొత్తుల్నీ తయారుచేస్తున్నారు. వివిధ పరిమాణాల్లో, తీరొక్క ఆకారాల్లో దొరుకుతున్నాయి ఈ డిజైనర్ క్యాండిల్స్. చూడచక్కని ఆ చిత్రాల సొగసు- క్యాండిల్‌తోపాటు ఇంటి మొత్తానికీ ప్రత్యేక ఆకర్షణ అవుతుందంతే!







రత్నాల తళుకులు!

కొవ్వొత్తి వెలుగుకు మెరుపుల రాళ్ల కాంతి కూడా జత అయితే... దీపావళి అలంకరణ మరింత అద్భుతం అవుతుంది. అది మీ ఇంట్లోనూ కనిపించాలంటే కొత్తగా వస్తున్న 'క్రిస్టల్ మినరల్ క్యాండిల్స్, అగేట్ రాక్ ఆయిల్ క్యాండిల్స్'ను కొని తెచ్చుకోండి. ఊదా, ఆకుపచ్చ, బంగారు, నీలం ఇలా వివిధ వర్ణాల్లోని రత్నాల రంగు రాళ్లను ఉపయోగించి, మైనాన్ని వాడుతూ ఈ లగ్జరీ కొవ్వొత్తులకు రూపమిస్తున్నారు. మెరుపుతోనూ, పరిమళాలతోనూ అందరినీ ఎంతగానో ఆకర్షిస్తాయి ఇవి!



రెండు కోట్లమందికిపైగా హృద్రోగులకు సేవలు అందించిందీ ఆసుపత్రి... ఇదో ప్రపంచ రికార్డు! ఇలాంటి రికార్డులు జయదేవ హాస్పిటల్ పేరిట చాలానే ఉన్నాయి. 5 స్టార్ హాస్పిటల్ సదుపాయాలూ, ఖరీదైన రోబోటిక్ సర్జరీలూ, విదేశీ స్థాయి వైద్యసేవలూ, పరాయి దేశాల నుంచీ క్యూలు కట్టే రోగులూ... ఇవన్నీ చూసి ఇదో ఖరీదైన కార్పొరేట్ ఆసుపత్రి అనుకుంటే పొరపాటు. ‘డబ్బులేదన్న కారణంతో ఒక్క పేదవాడు కూడా ప్రాణం పోగొట్టుకోకూడదు’ అన్న సంకల్పంతో పనిచేస్తున్న ఈ ప్రభుత్వ ఆసుపత్రి దేశంలోని ఎన్నో హాస్పిటల్స్‌కి ఆదర్శంగా ఎలా మారిందో తెలుసా...



‘గుండె భారం’ దించుతుందీ ఆసుపత్రి!





బెంగళూరు నగరంలోని బన్నెరఘట్ట రోడ్డు పేరుచెబితే పెద్దపెద్ద ఐటీ కంపెనీలూ, లక్షల్లో బిల్లులు వసూలుచేసే కార్పొరేట్ ఆసుపత్రులే దర్శనమిస్తాయి. వాటిమధ్యే... శ్రీ జయదేవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్క్యులర్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ సెంటర్ కూడా ఉంది. బయట నుంచి చూస్తే ఖరీదైన కార్పొరేట్ ఆసుపత్రిని తలపించినా, ఇదో ప్రభుత్వ ఆసుపత్రి అంటే నమ్మడం కష్టమే. తగినంతమంది వైద్యుల్లేక, సమయానికి నిధులు అందక సతమతమయ్యే సగటు ప్రభుత్వ ఆసుపత్రిలా కాకుండా రోజూ కొన్నివేలమంది హృద్రోగులకు అత్యాధునిక వైద్యసేవలు అందిస్తూ, ప్రాణాలు నిలబట్టే సంజీవనిగా నిలవడమే ఈ ఆసుపత్రి ప్రత్యేకత. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నా, స్వతంత్ర నిధులతో పనిచేసే ఈ ఆసుపత్రికి చుట్టుపక్కల జిల్లాల నుంచీ, విదేశాల నుంచీ కూడా రోగులు వస్తుంటారు. గతేడాదినే తీసుకుంటే... 4 లక్షల ఎకోకార్డియోగ్రామ్‌లూ, ఆరువేల ఓపెన్ హార్ట్ సర్జరీలూ చేసి ప్రపంచ రికార్డుని నెలకొల్పిందీ ఆసుపత్రి. ఇదంతా ఎలా సాధ్యమైందంటే....

నిజమైన డాక్టర్ మంజునాథ్ కల...

2001 ముందు వరకూ బెంగళూరు మెడికల్ కాలేజ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఓ చిన్న ఆసుపత్రిగా ఉన్న జయదేవ హాస్పిటల్ ఆ తర్వాతే బన్నెరఘట్ట రోడ్డుకి మారింది. మొదట్లో 150 పడకల ఆసుపత్రి... అయితే డా.సీఎన్ మంజునాథ్ ఆ ఆసుపత్రిలో అడుగుపెట్టిన తర్వాత మొత్తం కథే మారిపోయింది. ఒక సాధారణ డాక్టర్‌గా అడుగుపెట్టి, 16 ఏళ్లపాటు డైరెక్టర్‌గా ఉన్న మంజునాథ్ ఆ ఆసుపత్రిని ఓ ఫైవ్‌స్టార్ హాస్పిటల్‌గా చూడాలనుకున్నారు. ఇందుకోసం ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టారాయన. అందులో మొదటిది... ‘పూర్ పేషెంట్ కార్పస్‌ఫండ్’. అత్యవసర చికిత్స కోసం వచ్చే ఏ రోగీ ప్రభుత్వం అందించే నిధుల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూడకుండా చేసేదే ఈ ఫండ్. దాతలూ, పెద్దపెద్ద సంస్థలూ ఇచ్చిన పాతిక కోట్ల రూపాయలతో ఈ ఫండ్ ప్రారంభమైంది. ఇక్కడ పనిచేసే వైద్యులూ, సిబ్బందీ కూడా ఏడాదిలో ఒక రోజు తమ వేతనాన్ని ఈ కార్పస్ ఫండ్‌కి ఇస్తారు. ప్రస్తుతం రూ.210 కోట్లకు చేరుకున్న ఈ ఫండ్ నుంచే... ఏటా పేదల వైద్యం కోసం రూ.20 కోట్లు కేటాయిస్తున్నారు. ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజ ఐటీ సంస్థలని ఒప్పించి వాటి సీఎస్ఆర్ నిధులతో... కార్డియాక్ క్యాత్ లాబ్‌లూ, ఆపరేషన్ థియేటర్లూ, వంద ఐసీయూలని ఏర్పాటు చేశారు. ఇక్కడ బైపాస్ గ్రాఫ్టింగ్, యాంజియోప్లాస్టీ, స్టంట్ రిప్లేస్‌మెంట్, పేస్‌మేకర్ వంటివాటితోపాటు ఖరీదైన బెలూన్ మిట్రల్ వాల్వులోప్లాస్టీ వంటివాటినీ ఉచితంగా అందిస్తారు. డబ్బుల్లేని మధ్యతరగతి వారికీ కార్పస్ ఫండ్ సాయంతో వైద్య సేవలు అందిస్తారు. ఏటా ఇక్కడకు 7 లక్షలమంది రోగులు వస్తుంటే అందులో 85 శాతం మందికి పూర్తి ఉచితంగా ఖరీదైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడకు వచ్చిన వాళ్లు పేదవాళ్లా, ధనికులా అన్నది ముఖ్యం కాదు... ‘ట్రీట్‌మెంట్ ఫస్ట్, పేమెంట్ నెక్స్ట్’, ‘లైఫ్ ఈజ్ మోర్ ఇంపార్టెంట్ దేన్ ది ఫైల్’, ‘హ్యూమానిటీ ఈజ్ ప్రయార్టీ’ అనే సూత్రాలని ఇక్కడున్న ప్రతి ఉద్యోగీ తు.చ తప్పకుండా ఆచరిస్తారు. గుండె వైద్యానికి సంబంధించి ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా వంటి దేశాలు అనుసరించే విధానాలని అధ్యయనం చేసి ఇక్కడా వాటిని ‘మంజునాథ్ టెక్నిక్స్’ పేరుతో అమలు చేస్తున్నారు. ఈ సేవలకే ఆయన పద్మశ్రీ అవార్డునీ అందుకున్నారు.

శాటిలైట్ ఆసుపత్రులతో సేవలు...

120మందికి పైగా హృద్రోగ నిపుణులున్న జయదేవ ఆసుపత్రి ఇప్పటి వరకూ 2.10కోట్ల మందికి వైద్య సేవలు అందించింది. ఎక్కడా ఆలస్యం చేయకుండా చకచకా వైద్య సేవలు అందించే సంస్థ కాబట్టే... ప్రభుత్వ ఆస్పత్రులు అత్యంత అరుదుగా అందుకునే నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్-నాబ్ గుర్తింపుని రెండు సార్లు అందుకుంది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరగడంతో మైసూరు, కలబురగి, హుబ్బళ్లి, ధార్వాడల్లోనూ శాఖలని ప్రారంభించిందీ సంస్థ. అలాగే, శాటిలైట్ హాస్పిటల్స్ పేరుతో గ్రామీణ ప్రాంతాల వారికీ అందుబాటులో ఉండేలా క్లినిక్స్ ఏర్పాటు చేసి సత్వర వైద్యం అందిస్తోంది. కార్డియాక్ రిహాబిలిటేషన్ సెంటర్ పేరుతో రోగులకు మానసిక స్థైర్యాన్నీ అందిస్తోంది. వారి జీవనశైలిలో మార్పులకూ శ్రీకారం చుడుతూ... ఆసుపత్రి అంటే ఇలా ఉండాలి అనేలా ప్రశంసలు అందుకుంటోంది.

– కె.ముకుంద, ఈనాడు, బెంగళూరు



కథ

పరువమా... నిదానించు

- డా॥ మజ్జి భారతి

మేఘాల మధ్య పయనిస్తున్న సుధేష్ణ చేతిలో పెళ్ళికార్డు నలుగుతోంది. మైగాడ్! ఆ రోజు అంకుల్ రాకపోయుంటే... ఇందులో పెళ్ళికూతురుగా తన పేరుండేది. థాంక్ గాడ్! అసలు పదిహేడేళ్ళ వయసులో ఏం తెలుసని? ఆలోచిస్తే నవ్వొస్తోంది... అప్పుడెంత మూర్ఖంగా ప్రవర్తించామా అని. ఆ వయసులోనే ప్రేమ, ఒకరిని విడిచి ఒకరు ఉండలేమన్న భ్రమ, పెద్దల్ని ఎదిరించైనా పెళ్ళి చేసుకోవాలన్న అవివేకం, పెళ్ళి చేసుకుని ఇంటికి తిరిగొస్తే వాళ్ళే ఒప్పుకుంటారన్న విశ్వాసం... ఎంత తెలివి తక్కువతనం!

అసలు సిద్ధార్థలో తానేమి చూసిందప్పుడు... అందమా చదువా ఆస్తా? పెద్ద అందగాడు కాదు. చదువులో తనకన్నా తెలివైనవాడైతే కాదు. ఆస్తా... అప్పటికి అటువంటి విషయాలను ఆలోచించుకునేంత తెలివితేటలు కూడా లేవు. మరెందుకు ప్రేమించానని అనుకుంది? తనని తానే ప్రశ్నించుకుంటే, దానికిప్పుడు సమాధానం లేదు. వయసుతో వచ్చిన ఆకర్షణై ఉంటుంది. అది వ్యామోహంగా మారి ఉంటుంది. లేకపోతే మరేమిటి... సిద్ధూ పేరు వినగానే తనలో ఏవో పులకింతలు. సిద్ధూ వేళ్ళకొసలు తగలగానే మనసులో ప్రణయరాగాలు. అవే జీవితానికి అర్థం పరమార్థం అనిపించేది. సిద్ధూని క్షణం వదిలి ఉండలేననిపించేది. సిద్ధూని తప్ప, పక్కనెవరినీ ఊహించుకోలేకపోయేది. మరిప్పుడో... ఏడేళ్ళ గతానికి వెళ్తే, అంత ఫూలిష్‌గా ప్రవర్తించింది తానేనా అనిపిస్తుందిప్పుడు.


ఆరోజు అంకుల్ రాకపోయుంటే? మైగాడ్! ఈసరికి పెళ్ళయిపోయి పిల్లల్ని కూడా కనుండేదేమో. ఊహించుకోవడానికే భయంగా ఉంది. హైదరాబాద్ పారిపోయి పెళ్ళి చేసుకుందామని ట్రైనెక్కిన తమ పక్కన- సిద్ధూ వాళ్ళ నాన్నగారు. గుండాగినంత పనైంది తామిద్దరికీ. వాళ్ళబ్బాయిని లేపుకెళ్ళిపోతున్నానని ఎన్ని మాటలంటారో... తన కుటుంబం పరువు తీస్తారేమో... ఇప్పుడు ఇంటికి తిరిగెళ్ళి అమ్మానాన్నలకు ముఖాన్నెలా చూపించాలో... అనుకుంటూ ఎంత టెన్షన్ పడిందో. ఎంసెట్ ఎంట్రన్స్ రాసిన కూతురు ఒకబ్బాయితో లేచిపోయిందంటే తన తల్లిదండ్రుల దృష్టిలో తానెంత హీనంగా నిలబడాలి. దానికన్నా చచ్చిపోవడం నయం. మనసులో ఇన్ని ఆలోచనలు సుడులు తిరుగుతుండగా...

'ఒక్క ఆరేళ్లు ఆగండి. అప్పటికీ మీరిదే అభిప్రాయంతో ఉంటే, మేమే మీ పెళ్ళి జరిపిస్తాం. నువ్వు తెలివైనదానివని విన్నాను. కోడలిగా వస్తానంటే నాకేమీ అభ్యంతరం లేదు. నీ తల్లిదండ్రులను కూడా ఒప్పించగలను. మీరిద్దరూ ఒకరినొకరు చూసుకోకూడదు, మాట్లాడుకోకూడదన్న కండిషన్ కూడా పెట్టను. మీకు నచ్చినట్టుండొచ్చు. ఆరేళ్ళ తర్వాత మీకు పెళ్ళి చేసే అవకాశాన్ని మాకివ్వండి' అని ఆయనంటే తనకెంత ఆనందమేసిందో! అమ్మానాన్నలతో ఏం చెప్పారోగానీ వాళ్ళొక్క మాటా అనలేదు.

ఎంసెట్ రిజల్ట్స్ వచ్చాయి. తన ర్యాంకుకు, ఏ కాలేజీలోనైనా సీటొస్తుంది. సిద్ధూ కొచ్చిన ర్యాంకుకు ఏదో ఒక ప్రైవేట్ కాలేజీలో జాయినవ్వాల్సిందే. తనలో డైలమా- 'సిద్ధూని వదిలి వేరే కాలేజీలో జాయినవ్వాలా వద్దా' అని. కానీ ఎన్ఐటీ వరంగల్‌లో సీటొచ్చాక వేరే ఆలోచన లేకుండా జాయినైపోయింది. సిద్ధూకి తానంత దూరం వెళ్ళడం ఇష్టం లేకపోయినా ఏమీ మాట్లాడలేదు. అక్కడికెళ్ళాక తనకూ గుబులుగానే ఉండేది- సిద్ధూని వదిలి వచ్చానని. కానీ, ఫోన్‌లూ వీడియో కాల్సూ ఆ విషయాన్ని మరిపించేవి. రానురానూ, కొత్త పరిచయాలూ స్నేహాలూ సెమినార్లూ ప్రాజెక్టులూ... అలా సిద్ధూతో మాట్లాడే సమయం తగ్గిపోతూ, వేరే విషయాల మీద ఫోకస్ ఎక్కువైంది.

మొదటిసారి సెలవులకి వెళ్ళినప్పుడు ఎప్పుడెప్పుడు సిద్ధూని చూస్తానా అనిపించిన తనకు, ఆ తర్వాత్తర్వాత ఇంటికొస్తే- ఫ్రెండ్సుతో ప్రాజెక్టుల గురించీ క్లాసుల గురించీ పరీక్షల గురించీ మాట్లాడటంతో సరిపోయేది. సిద్ధూని కలిసినా మొదట్లో ఉన్న ఎగ్జైట్‌మెంట్ ఉండేది కాదు.

చుట్టూవున్న లోకం పరిధి విస్తృతమవుతుంటే, ఆలోచనా సరళి కూడా మారుతుంది. ఆ విషయం ఎన్ఐటీలో చేరాక తెలిసింది తనకు. ఎన్ఐటీ క్యాంపస్‌లో కొన్నాళ్ళు గడిపాక, దీనిముందు- ఇంతవరకూ తాను చూసిన



ప్రపంచం చాలా చిన్నదనిపించింది. తాను చదివిన కాలేజీలో నంబర్ వన్ తానే. మరిక్కడో... తనలాంటి వాళ్ళు ఎంతోమంది. మొదటి మూడు ర్యాంకుల్లో కాదు సరికదా... మొదటి పది మందిలో ఒకరిగా ఉండాలన్నా, ఎంత కష్టపడాలో తెలిసొచ్చింది. నూతిలోని కప్ప సామెత అర్థమయింది. అప్పట్లో, ఎంత మూర్ఖంగా ఆలోచించానా అనిపించేది.

అందరి తల్లిదండ్రులూ అంకుల్‌లాగా ఆలోచిస్తే, టీనేజ్ పెళ్ళిళ్ళూ వాటితో వచ్చే గొడవలూ ఆత్మహత్యలూ పరువు హత్యలూ ఉండనే ఉండవు. ఆరోజు అంకుల్ రాకపోయి ఉంటే తామిద్దరి జీవితాలు ఇప్పుడెలా ఉండేవో ఊహకు కూడా అందడం లేదు సుధేష్ణకు. ఏదేమైనా తానిప్పుడిలా, మంచి ఉద్యోగం చేస్తూ అమెరికా వెళ్తోందంటే, అంకులే కారణం. ఎదురుగా లేని సిద్ధార్థ తండ్రికి, మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది సుధేష్ణ.

★ ★ ★

"సుధేష్ణ అమెరికా వెళ్తోందట. నీ పెళ్ళి కార్డిస్తే బాగుంటుందేమో!" అన్న నాన్న మాటలకు సిద్ధార్థకు మనసులో సందిగ్ధం. తన పెళ్ళి శుభలేఖ సుధేష్ణకివ్వాలా? తామిద్దరూ కలుసుకుని ఎన్ని రోజులైంది? కొన్ని నెలలై ఉంటుంది. ఏడేళ్ళ కిందట, తెలియనితనంతో, వయసు తెచ్చిన ఆకర్షణకు లోనై, ప్రేమించుకున్నామనీ పారిపోయి పెళ్ళి చేసుకుందామనీ అనుకున్నారు. అది జరగలేదు. కాలంతోపాటు తమ మధ్య ఆకర్షణ కూడా కరిగిపోతూ వచ్చింది. మొదట్లో బాధగా, శూన్యంగా అనిపించినా, తర్వాత్తర్వాత స్నేహితుల్లా అనిపించినా, ఆ తర్వాత ఏమీ అనిపించేది కాదు. కలిసినప్పుడు ఏం మాట్లాడాలో కూడా తెలిసేది కాదు. 'హాయ్, ఎప్పుడొచ్చావ్, ఎలా ఉన్నావ్ తప్ప వేరే మాటలు కూడా ఉండేవి కాదు. ఒకప్పుడు తామిద్దరూ ప్రేమించుకున్నామన్న విషయాన్ని కూడా మర్చిపోయారు.

ఇప్పుడీ శుభలేఖ ఇవ్వడం అంత అవసరమా అన్నట్టు చూస్తే, అవునన్నట్టు చూసిన నాన్న చూపులతో ఎయిర్‌పోర్టుకు వెళ్ళాడు సిద్ధార్థ. "ఓహ్! అప్పుడే పెళ్ళా! ఏనీవే కంగ్రాట్యులేషన్స్" అని చెప్పిందే గానీ, ఆమె గొంతులో ఏ రకమైన డిజప్పాయింట్‌మెంట్ లేదు. ఉంటుందని తాను మాత్రం ఎక్స్‌పెక్ట్ చేశాడా? లేదు. సుధీ ఎన్ఐటీకి వెళ్ళిన సంవత్సరం తర్వాత అనిపించింది... తామిద్దరూ సంవత్సరం కిందటిలా లేమని. ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోవడం, ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఎదురుచూడ్డం, కలిశాక చుట్టూ ఏం జరుగుతోందో కూడా పట్టించుకోకపోవడం... ఇంటర్ చదువుతున్నప్పుడు ఆ స్థితిలోనే ఉండేవారు. పెద్దవాళ్ళు ఒప్పుకోరని, పారిపోయి పెళ్ళి చేసుకుందాం అనుకున్నారు. నాన్న రాకపోయుంటే, అంత పనీ జరిగేదే!

ఆరేళ్ళు పోయాక, మీ పెళ్ళి జరిపిస్తానన్న నాన్న భరోసాతో వెనక్కొచ్చిన తాము- భరోసా ఏంటిలే, నాలుగు తగిలించి ఇంటికి తెస్తే మాత్రం కాదన్న వాళ్ళెవరు- ర్యాంకులను బట్టి వేర్వేరు



కాలేజీల్లో జాయినవ్వాల్సి వస్తే మొదట్లో ఎంత బాధపడ్డారో! తర్వాత సుధేష్ణ ఎన్ఐటీలో చేరాక, తమ ఇద్దరి మధ్యా దూరం పెరిగిందని ఎంత తల్లడిల్లిపోయారో! నాలుగేళ్ళే కదా, కష్టపడి ఎలాగోలా గడుపుదామని, ఒకరినొకరు ఎంత ఓదార్చుకున్నారో? మొదట్లో ప్రతిరోజూ వీడియో కాల్స్ కోసం ఎదురుచూపులు, స్వీట్ నథింగ్స్ పంచుకోవడం... అదే ప్రపంచం. ఆ తర్వాత నెమ్మదిగా సుధీ తనకు దూరమవుతున్నట్టు అనిపించేది. మొదట్లో ప్రతిరోజూ ఫోన్ చెయ్యమనే సుధీ, తర్వాత్తర్వాత 'బిజీగా ఉన్నాను. రేపు మాట్లాడదామేం ప్లీజ్!' అనేది. ఫస్ట్ సెమిస్టర్ తర్వాత కలిసినప్పుడు ఉన్నంత ఎగ్జైట్‌మెంట్, సెకండ్ సెమిస్టర్ తర్వాత లేదు. చిత్రంగా తనకి కూడా పెద్ద బాధనిపించలేదు. ఆ తర్వాత్తర్వాత తనొచ్చాక తెలిసేది- వచ్చిందని.

తానేమో ఉన్న ఊర్లోనే, ఇంజనీరింగ్ అయ్యాక నాన్న బిజినెస్ చూసుకుందామని. సుధీకేమో పైచదువులు చదవాలనీ, ఎమ్మెస్ చేసి అమెరికాలో ఉద్యోగం చెయ్యాలనీ. ఇద్దరి కోరికల్లోనే ఎంత వ్యత్యాసమో! రోజులు గడుస్తున్నకొద్దీ తామిద్దరూ ఒకరికొకరు సరిపోమేమోనని పించేది. ఆ విషయం పూర్తిగా ఎప్పుడు తెలిసింది తనకు... ఫస్టియర్ పరీక్షలయ్యాక, సుధీ ఫ్రెండ్స్ పల్లెటూర్లు చూద్దామని తమ ఊరొచ్చినప్పుడు. వాళ్ళందరూ ధారాళంగా ఇంగ్లీషులో, సబ్జెక్టు గురించి మాట్లాడుకుంటుంటే... తనకేమో సబ్జెక్టూ లేదు, ఇంగ్లీషూ రాదు. సుధీ కూడా అదివరకులా లేదు. వేషభాషలు కూడా మారిపోయాయి. అప్పుడున్నంత గాఢత తమ బంధంలో లేదేమో అనిపించేది. అనిపించి, బయటకు చెప్పకపోయినా సుధీని ఫ్రెండ్‌గా చూడటం అలవాటు చేసుకున్నాడు. ఆ తర్వాత అదీ లేదు. అప్పుడు అర్థమైంది అసలు తమ అభిరుచులూ అభిప్రాయాలూ ఆకాంక్షలే వేరని.

ఇంటి నుండి పారిపోతున్న తామిద్దరినీ తిట్టకుండా, 'చదువుకున్నాక నిర్ణయం మీదే' అని నాన్న చెప్పబట్టిగానీ, 'బుద్ధుందా! ఈ వయసులో ప్రేమలూ పెళ్ళిళ్ళా' అని తిట్టి ఉంటే, కచ్చితంగా రెబల్స్‌లా తయారయ్యేవాళ్ళు. నిజంగా అప్పుడు పెళ్ళి చేసుకుని ఉంటే, ఈసరికి విడిపోయి ఉండేవారేమో తామిద్దరూ. విడిపోకపోయినా, తమ పరిస్థితికి 'నువ్వు కారణమంటే, నువ్వు కారణ'మని తిట్టుకుంటూ ఉండేవారేమో. అటువంటి పరిస్థితి తమకు ఎదురవ్వకుండా- తెలిసీ తెలియని వయసులోని విరిసీ విరియని ప్రణయాలెప్పటికీ మేలు చెయ్యవనీ, పరుగులు తీసే పరువాన్ని నిదానించుకోవాలనీ, చదువు పూర్తయి ఉద్యోగాలు సంపాదించుకున్నాక తీసుకునే నిర్ణయాలకు విలువ ఉంటుందనీ- తామిద్దరికీ సున్నితంగా తెలిపినందుకు నాన్నకు థ్యాంక్స్ చెప్పుకోవాలి. అంతేకాదు, ఈ శుభలేఖ ఇప్పించి, ఒకప్పుడు తమ ఇద్దరి మధ్యా ఏదో జరిగిందనే అపరాధ భావాన్ని తమ మనసుల్లో నుండి తొలగించినందుకు కూడా థ్యాంక్స్ చెప్పుకోవాలి... ఎయిర్‌పోర్ట్ నుండి తిరిగొస్తూ అనుకున్నాడు సిద్ధార్థ. ★

సిసింద్రీ



ఆ ఒక్కటి ఏది?

ఇక్కడున్న పూల కుండీల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.




గప్‌చుప్

సెలవులు కావడంతో పిల్లలంతా పార్కుకెళ్లి ట్రైన్‌లో షికారు చేస్తున్నారు కదూ! బొమ్మను బాగా గమనించి, కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి మరి.

1. బొమ్మలో మొత్తం ఎన్ని సీతాకోకచిలుకలు ఉన్నాయి?
2. ఇచ్చిన ఆధారం సాయంతో ఆ పార్కు పేరేంటో చెప్పగలరా?
3. ఒకచోట ఐస్‌క్రీమ్ దాగి ఉంది. ఎక్కడో కనిపించిందా?
4. బొమ్మలో ఒక పొరపాటు ఉంది. అదేంటో తెలిసిందా?
5. ఇక్కడ కనిపిస్తున్న పక్షుల్లో ఒకదాన్ని శాంతికి చిహ్నంగా చెబుతుంటారు. దాని పేరేంటి?



అది ఏది?



A B C D E F G H I J K L M
N O P Q R S T U V W X Y Z

కిందున్న అక్షరాలన్నింటినీ బోర్డు మీద రాయాలనుకుంది లహరి. కానీ, ఒక్కదాన్ని మాత్రం మర్చిపోయింది. అది ఏదో మీకు తెలిసిందా?

ఎక్కడబ్బా?

పిల్లలు ఆటలాడుతూ గ్లవ్స్ అన్నింటినీ గజిబిజిగా కలిపేశారు. బొమ్మలోని నేస్తాల చేతికున్న గ్లవ్ జతలో మరొకటి ఎక్కడుందో మీకు కనిపించిందా?




తికమక మకతిక

ఇక్కడ నలుగురు పిల్లల బొమ్మలున్నాయి. కానీ, అవి ముక్కలు ముక్కలుగా వేర్వేరు చోట్ల ఉన్నాయి. మీరు వాటిని సరిగ్గా అమర్చగలరా?



దారి కనుక్కోండి

ఆహారం కోసం బయటకు వెళ్లి, ఇంటికి చేరే దారి మర్చిపోయిందో బుజ్జి కుందేలు. దానికి మీరు మార్గం చూపి, కాస్త సాయం చేయరూ!



తప్పులే తప్పులు

స్నేహితులంతా కలిసి కాలక్షేపం చేస్తున్నారు కదూ.. ఈ బొమ్మలో అయిదు తప్పులున్నాయి. అవేంటో కనిపెట్టండి మరి!



మిగిలింది అదే..!


అంకుల్: ఏంటి కిట్టూ.. నీకెప్పుడూ సున్నా మార్కులే వస్తుంటాయా?

కిట్టు: నా తప్పేం లేదు అంకుల్.. మా తరగతిలో ఉన్న వారందరూ 1 నుంచి 100 వరకూ అంకెల్ని పంచుకోగా, చివరకు నాకు సున్నానే మిగులుతోంది మరి!

అంకుల్: ఆc..!

కనిపెట్టగలరా?

ఇక్కడ తాడుతో ఉన్న ఆకారంలో ఒకటి నుంచి తొమ్మిది వరకూ అంకెలు దాగున్నాయి. జాగ్రత్తగా గమనించి, అవి ఎక్కడున్నాయో చెప్పగలరా?



బెడిసికొట్టిన పథకం!

ఒక గ్రామంలో గుణ, ధన అనే యువకులు ఉండేవారు. గుణ కాస్త అమాయకుడు, సంపన్నుడు. ధన మాటలతోనే పబ్బం గడిపే వాడు. మిత్రులతో కలిసి తరచుగా గుణ ఇంటికి వెళ్తూ పందేలూ, పొడుపు కథలతో కాలక్షేపం చేసేవాడు. ఒకరోజు ఎప్పటిలాగే స్నేహితులతో కలిసి గుణ ఇంటికెళ్లాడు ధన. అతడి ఆస్తి కాజేయాలని 'ఈరోజు పందెంలో నేను అడిగే ప్రశ్నకు సరైన సమాధానం చెబితే, నా ఆస్తి మొత్తాన్ని నీకు రాసిస్తా. లేకపోతే నీ ఆస్తి మొత్తం నాదే..' అని గుణతో చెప్పాడు ధన. 'నువ్వొక్కడివే కాదు.. పందెం కాసే అవకాశం గుణకు కూడా ఇవ్వు' అని వెంట వచ్చిన మిత్రులు అనడంతో సరేనంటూ తనకూ అదే



నియమం వర్తిస్తుందన్నాడు. ధన ప్రశ్నకు గుణ సరైన సమాధానం చెప్పకపోవడంతో 'నీ సొత్తంతా ధన గెలుచుకున్నాడు. ఇప్పుడు నువ్వో ప్రశ్న అడుగు' అన్నారు మిత్రులు. అలాగేనంటూ తనకు తెలిసింది అడిగాడు గుణ. ఓడిపోవాలనే ఎత్తుగడతోనే తప్పు సమాధానం చెప్పాడతను. దాంతో మిత్రులు ధనతో 'మొదటి పందెం నువ్వు గెలుచుకున్నావు కాబట్టి గుణ ఆస్తి నీదవుతుంది. రెండో పందెంలో గుణ గెలవడంతో నీ సొత్తు తనదవుతుంది. అంటే, మీ ఇద్దరూ ఆస్తులు మార్చుకోండి' అన్నారు. అందుకు గుణ ససేమిరా అనడంతో న్యాయాధికారి దగ్గరకు తీసుకెళ్లాడు ధన. వారి వాదనలు విన్నాక.. 'మొదటి పందెంలో ఓడినందుకు నువ్వు నీ ఆస్తి అంతా ధనకు రాసివ్వాల్సిందే..' అంటూ కాగితం చేతికి ఇచ్చాడు న్యాయాధికారి. మరో మార్గం లేక అలాగే రాసిచ్చేశాడు గుణ. 'రెండో పందెంలో ఓడినందుకు నీ ఆస్తిని గుణకు రాసి ఇవ్వు' అని ధనతో అన్నాడు అధికారి. 'నాకు ఉన్నది చిన్న ఇల్లొక్కటే..' బదులిచ్చాడతను. 'కాదు.. నువ్వు గుణతో పందెం ఓడే సమయానికే అతడి ఆస్తిని గెలుచుకున్నావు. అంటే.. అదీ నీ ఆస్తే. మీ పందెం ప్రకారం గుణ ఆస్తిలో నీకేమీ రాకపోగా.. నీ ఇల్లూ అతడికే దక్కుతుంది' అంటూ తీర్పునిచ్చాడు న్యాయాధికారి. మోసానికి పోయి, ఉన్న ఇల్లూ పోగొట్టుకోవడంతో ఊరొదిలి వెళ్లిపోయాడు ధన.

రంగులేద్దాం




జవాబులు

గప్‌చుప్: 1. ఆరు 2. మహాత్మాగాంధీ పార్కు 3. రైలు ఇంజిన్ పొగలో 4. ఇంజిన్‌కీ బోగీకీ మధ్యలో లింక్ లేదు 5. పావురం.

ఆ ఒక్కటీ ఏది?: 5 (ఆకు).

తప్పులే తప్పులు: 1. కుండీలో కమలం పూయడం 2. డిజిటల్ గడియారంలో 24 గంటల కంటే ఎక్కువ సమయం చూపిస్తోంది 3. బాబు ఒక కాలికి షూ, ఇంకో కాలికి చెప్పు 4. టెడ్డీబేర్‌కి పొడవైన తోక 5. కుందేలు చెట్టెక్కడం.

కనిపెట్టగలరా?



అది ఏది?: X

ఎక్కడబ్బా?: రాము (C-6), రాణి (C-2), రాజు (D-3), రవి (B-4).

తికమక మకతిక: 1-8-10, 2-7-9, 3-5-11, 4-6-12.

ఇల్లంతా దీపాలు వెలిగించి, టపాసులు కాలుస్తూ... సిరిసంపదలు ప్రసాదించే లక్ష్మీదేవిని ఆహ్వానించేవేళ... నోటిని తీపి చేసుకోవడమూ ముఖ్యమేగా. అందుకే ఈ దీపావళిని మిఠాయిలతో ఆహ్వానిద్దామా మరి.

పండగ విందు భలే పసందు!



డ్రైఫ్రూట్స్ గుజియా

కావలసినవి: మైదా: మూడు కప్పులు, నెయ్యి: పావుకప్పు, ఉప్పు: పావుచెంచా, నూనె: వేయించేందుకు సరిపడా.

ఫిల్లింగ్‌కోసం: ఎండుకొబ్బరిపొడి: అరకప్పు, బాదంపలుకులు: పావుకప్పు, పిస్తా పలుకులు: పావుకప్పు, జీడిపప్పు పలుకులు: పావుకప్పు, ఖర్జూరాల తరుగు: పావుకప్పు, కిస్‌మిస్: పావుకప్పు, యాలకుల పొడి: చెంచా, చక్కెర: అరకప్పు.

తయారీ విధానం: స్టఫింగ్‌కోసం పెట్టుకున్న పదార్థాలన్నింటినీ ఓ గిన్నెలో వేసుకుని కలుపుకోవాలి. అదేవిధంగా మరో గిన్నెలో మైదా, నెయ్యి, ఉప్పు వేసుకుని అన్నింటినీ కలుపుకోవాలి. తర్వాత నీళ్లు చల్లు కుంటూ పూరీపిండిలా కలిపి పెట్టుకోవాలి. పావుగంటయ్యాక కొద్దిగా పిండిని తీసుకుని చిన్న చపాతీలా ఒత్తి... మధ్యలో డ్రైఫ్రూట్స్ మిశ్రమాన్ని ఉంచి.. అంచుల్ని మూసేయాలి. లేదంటే కజ్జికాయల అచ్చులో వేసి ఒత్తినా సరిపోతుంది. ఇలా చేసుకున్నవాటిని రెండు మూడు చొప్పున కాగుతున్న నూనెలో వేసి వేయించుకుని తీసుకోవాలి.



నువ్వులు- కోవా లడ్డు

కావలసినవి: తెల్ల నువ్వులు: రెండు కప్పులు, కోవా: రెండు కప్పులు, చక్కెర: కప్పు, యాలకులపొడి: అరచెంచా.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి... నువ్వుల్ని దోరగా వేయించుకోవాలి. ఆ తర్వాత బరకగా పొడి చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద మళ్లీ కడాయిని పెట్టి.. కోవా వేసి మధ్యమధ్య కలుపుతూ ఉండాలి. అది కరిగి, రంగు మారుతున్నప్పుడు స్టవ్‌ని కట్టేయాలి. ఇందులో మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలిపి లడ్డుల్లా చుట్టుకుంటే చాలు.

పనీర్ బాదుషా

కావలసినవి: మైదా: ఒకటిన్నర కప్పు, పనీర్ తురుము: రెండువందల గ్రా, నెయ్యి: ఆరు టేబుల్‌స్పూన్లు, పెరుగు: నాలుగు టేబుల్‌స్పూన్లు, పాలు: అరకప్పు, బేకింగ్‌సోడా: పావుచెంచా, కుంకుమపువ్వు రేకలు: పది, యాలకులపొడి: పావుచెంచా, చక్కెర: రెండుకప్పులు, నీళ్లు: కప్పు, నూనె లేదా నెయ్యి: వేయించేందుకు సరిపడా.

తయారీవిధానం: చక్కెర, నీళ్లు ఓ గిన్నెలో వేసుకుని స్టవ్‌మీద పెట్టాలి. చక్కెర కరిగాక కుంకుమపువ్వు రేకలు, యాలకులపొడి వేసి లేతపాకంగా ఉన్నప్పుడే దింపేయాలి. ఓ గిన్నెలో మైదా, బేకింగ్‌సోడా వేసి కలుపుకోవాలి. తరువాత నెయ్యి వేస్తూ కలపాలి. ఇప్పుడు పనీర్ తురుము కూడా వేసుకుని బాగా కలిపి పాలు, పెరుగు వేసుకోవాలి. ఇవన్నీ బాగా కలిశాక నీళ్లు చల్లుకుంటూ గట్టి పిండిలా చేసుకుని మూత పెట్టాలి. అయిదు నిమిషాలయ్యాక కొద్దిగా పిండిని తీసుకుని వెడల్పుగా చేసి మధ్యలో చిల్లులా పెట్టుకోవాలి. ఇలా అన్నింటినీ చేసుకుని రెండుమూడు చొప్పున కాగుతున్న నూనె లేదా నెయ్యిలో వేస్తూ ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. వీటిని చక్కెర పాకంలో వేసుకుని అయిదు నిమిషాల య్యాక విడిగా తీసుకోవాలి.



బేసన్ బర్ఫీ

కావలసినవి: సెనగపిండి: కప్పు, కండెన్స్‌డ్‌మిల్క్: ముప్పావుకప్పు, చక్కెర పొడి: మూడు టేబుల్‌స్పూన్లు, కరిగించిన నెయ్యి: నాలుగు టేబుల్‌స్పూన్లు, యాలకులపొడి: పావుచెంచా, బాదం-పిస్తా పలుకులు: అలంకరణకోసం.



తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి నెయ్యి వేయాలి. అది వేడెక్కాక స్టవ్‌ని సిమ్‌లో పెట్టి సెనగపిండి వేసి పచ్చివాసన పోయేవరకూ వేయించాలి. ఇందులో యాలకులపొడి, కండెన్స్‌డ్‌మిల్క్ వేసి బాగా కలిపి చిక్కగా అవుతున్నప్పుడు స్టవ్‌ని కట్టేసి చక్కెర పొడి వేసి కలిపి దింపేయాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన ప్లేటులో పరిచి... పైన బాదం, పిస్తా పలుకుల్ని అలంకరించి, ముక్కల్లా కోస్తే చాలు.

రాశి ఫలం

(అక్టోబరు 19 - 25)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కాలం కొంత వ్యతిరేకంగా ఉంది. ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. జీవిత లక్ష్యం మీద దృష్టి పెట్టండి. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. ముఖ్య నిర్ణయాల విషయంలో కుటుంబ సభ్యులను సంప్రదించండి. పరిస్థితులకు తగినట్టు వ్యూహాలను మార్చుకోండి. వ్యాపారయోగం శుభప్రదం. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

విజయాలు దక్కుతాయి. స్వల్ప ప్రయత్నంతోనే మేలైన ఫలితాలు లభిస్తాయి. ఉద్యోగంలో కలిసొస్తుంది. చాలా విషయాల్లో మీదే పైచేయి అవుతుంది. వ్యాపార విస్తరణకు అవకాశాలు ఉన్నాయి. ఆర్థిక ఫలితాలు అనుకూలం. భూ, గృహ యోగాలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. మహాలక్ష్మిని ధ్యానించండి.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

సకాలంలో పనులను ఆరంభించండి. విజయాలు సిద్ధిస్తాయి. మనోబలంతో ముందుకు సాగాలి. సమాజంలో గౌరవం పెరుగుతుంది. దైవబలం ముందుకు నడిపిస్తుంది. కొత్త వ్యాపార ప్రయత్నాలకు సమయం కాదు. అవరోధాలు ఎదురైనా, ఆత్మవిశ్వాసాన్ని వదులుకోకండి. ఆత్మీయులతో విరోధాలు వద్దు. ఇష్టదైవాన్ని పూజించండి.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

మనోబలం అవసరం. గెలుపు లభించే వరకూ ప్రయత్నం ఆపకండి. ఆలోచనల్ని మంచివైపు మళ్లించండి. వ్యాపారంలో లాభాలు ఉన్నాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఉద్యోగంలో బాధ్యతతో మెలగాలి. సంభాషణల్లో సౌమ్యత అవసరం. అవకాశాల్ని సద్వినియోగం చేసుకోండి. వారాంతంలో శుభవార్త వింటారు. సుబ్రహ్మణ్యస్వామిని పూజించండి.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

సూర్యబలం కొత్తశక్తిని ప్రసాదిస్తుంది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగంలో ఉన్నత స్థితి గోచరిస్తోంది. ఆర్థిక ఫలితాలు అనుకూలం. నలుగురికీ ఉపయోగపడే పనులు చేస్తారు. కొత్త అవకాశాలు తలుపు తడతాయి. సమాజం మీ ప్రతిభను గుర్తిస్తుంది. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

విజయాలు సొంతం అవుతాయి. వ్యాపారం లాభదాయకం. ఆర్థికంగా మెరుగైన స్థితికి చేరుకుంటారు. ఉద్యోగ జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి. ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి. వాయిదా మనస్తత్వం పనికిరాదు. గృహ, వాహనాది యోగాలు ఉన్నాయి. మహాలక్ష్మిని ధ్యానించండి.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సమర్థతను చాటుకుంటారు. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. ఆత్మీయుల ప్రోత్సాహం అందుతుంది. ఆర్థిక ఫలితాలు అనుకూలం. రాబడులను సద్వినియోగం చేసుకోవాలి. రుణ సమస్యలకు దూరంగా ఉండండి. వ్యాపారంలో స్వల్ప ఇబ్బందులు ఉన్నా, మనోబలంతో అధిగమిస్తారు. కుటుంబానికి సమయం కేటాయిస్తారు. దుర్గామాతను స్మరించండి.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ముఖ్య విషయాల్లో విజయం మీదే. లక్ష్యంపైనే దృష్టి పెట్టండి. ఆలోచనలు పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. ఎరుకతో వ్యవహరించండి. సమయస్ఫూర్తితో వ్యాపార సమస్యల నుంచి బయటపడతారు. కొత్త నైపుణ్యాలను పెంచుకోండి. ఆలోచనలకు మరింత పదును పెట్టండి. అక్కడితో ఆగకుండా, ఆచరణకు ప్రాధాన్యం ఇవ్వండి. సూర్యుడిని ఆరాధించండి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

శుభప్రదమైన సమయం. అదృష్టయోగం ఉంది. మీ నిర్ణయాలు ఉత్తమ ఫలితాలను అందిస్తాయి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో పేరు తెచ్చుకుంటారు. పెద్దల ప్రోత్సాహం లభిస్తుంది. వ్యాపార కార్యకలాపాల విస్తరణకు తగిన సమయం. కొన్ని సమస్యలకు సృజనాత్మకమైన పరిష్కారాలను కనుగొంటారు. జీవిత ఆశయాలు సిద్ధిస్తాయి. లక్ష్మీ అష్టోత్తరాన్ని పఠించండి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగ ఫలితాలు అత్యుత్తమం. గతంలో ఆగిపోయిన పనులు వేగంగా పూర్తవుతాయి. ఆదాయ మార్గాలు పెంచుకుంటారు. పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. ఆలోచనల్లో అస్పష్టత వద్దు. దీనివల్ల వ్యాపారంలో గందరగోళం నెలకొనే ప్రమాదం ఉంది. కీలక నిర్ణయాల్లో ఆత్మీయులను సంప్రదించండి. విష్ణు సహస్రనామాన్ని పఠించండి.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఫలితాలు అనుకూలం. రాబడిని సద్వినియోగం చేసుకోండి. అనాలోచిత వ్యయాలు రుణ సమస్యలకు దారితీస్తాయి. ఆధ్యాత్మిక సాధనతో మనోబలాన్ని పెంచుకోండి. వృత్తి ఉద్యోగాల్లో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకండి. నలుగురితో సౌమ్యంగా వ్యవహరించండి. ఒకట్రెండు చేదు ఫలితాలు ఉన్నా, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దు. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కృషికి తగిన ఫలితం ఉంటుంది. ఉద్యోగంలో మేలు జరుగుతుంది. సమాజంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు తప్పనిసరి. కొన్నిసార్లు మేలు చేయబోతే కీడు జరిగే ప్రమాదం ఉంది. కాబట్టి, ఆచితూచి నిర్ణయాలు తీసుకోండి. వ్యాపారంలో అప్రమత్తత అవసరం. మిత్రుల అండ లభిస్తుంది. నవగ్రహ శ్లోకాలను చదువుకోవాలి.

పదకేళి

కూర్పు: బాలు

1		2	3		■	4	■	5		6	7
	■	8		■	9				■	10	
11			■	12	■		■	13	14		■
	■	15		■	16		17	■		■	18
■	19		■	20		■	21	22	■	23	
24		■	25	■	26		■	27	28		■
■	29	30		31		■	32			■	33
34	■		■		■	35	■		■	36	■
37		■	38			■	39	■	40		41
	■	42	■		■	43				■	
■	44	■	45		46	■		■	47		
48				■	49		■	50		■	

ఆధారాలు- అడ్డం

1. భార్యాభర్తలు (5)
5. కరుణ, దయ (4)
8. స్తుతి, పొగడ్త (2)
9. రజతాద్రి (4)
10. కాంతి, వెలుగు (2)
11. వత్తు లేకపోయినా నాయకురాలు నాగమ్మే (3)
12. అడ్డం 10తో- తెలుగు సంవత్సరాల్లో రెండోది (1)
13. మహిళ (3)
15. కృష్ణుడి ప్రేయసి (2)
16. ఉత్పలం (3)
19. పాదం (2)
20. ధర (2)
21. రాత్రి, నిశ (2)
23. మృత కళేబరం (2)
24. చెవి, కర్ణం (2)
26. గుర్రం (2)
27. మంచు, తుషారం (3)
29. స్వప్నమా సత్యమా? (2+3)
32. స్నేహం (3)
33. అడ్డం 12తో రొమ్ము (1)
35. అడ్డం 12తో గారె (1)
37. స్వర్గం (2)
38. కొండ కొన (3)
40. తామరపువ్వు (3)
42. అడ్డం 12తో ఉపన్యాసకుడు (1)
43. అద్దంలో కనిపించేది (4)
45. చులకన, తేలిక (4)
47. కుమార్తె (3)
48. ఉగాది పచ్చడిలోకి పువ్వు కావాలంటే- పెరట్లో ఇది ఉండాల్సిందే (4)
49. శయ్య, పాన్పు (2)
50. ఉన్ని (2)

ఆధారాలు- నిలువు

1. దుఃఖంతో, బాధతో కూడిన అరుపు (4)
2. కొడుకు కూతురు (5)
3. స్థితి, అవస్థ; దారి (2)
4. పప్పుచారులోకి నంజు, వరుగులు (4)
5. కుండ (3)
6. కవనం, కైత (3)
7. దేవనర్తకి (2)
14. అగ్ని (2)
16. జగడమా? (4)
17. వనం (2)
18. శబ్దం, ధ్వని (2)
19. బహుమతి (3)
22. అమావాస్య చంద్రుడు (4)
23. బాణం (2)
25. ఓ గ్రహం, ఒక వారం (2)
28. నవ్వు (2)
30. భారీ వాహనం (2)
31. '.......' చూడటమంటే ఆదాయ వ్యయాలను లెక్క చూసుకోవడం (5)
34. ఆకాశంలో వెలుగు ... శంప (3)
36. హిందీలో- అమ్మను గౌరవంగా ఇలా పిలుస్తారు; ప్రస్తుతం పదవిలో లేనివాళ్ళను ఇలా వ్యవహరిస్తారు (2)
39. స్త్రీ (3)
40. రాపులుగులంటే? (4)
41. నూరో తప్పిదం? (2+2)
44. బాల, శిశువు (2)
45. దోశ (2)
46. పువ్వు (2)

సుడొకు

	5		2	1	7	4		
		9	3	4	6			1
4	6							
			9	6	5		3	
6		5				1		2
	3		1	2	8			
							2	6
8			6	5	3	9		
		6	8	9	2		1	

గతవారం సమాధానాలు


పదకేళి

1 తు	పా	2 కీ	■	3 మొ	■	4 సం	5 గ	నా	6 చి	■	7 పో
ల	■	8 రా	జ్యా	న	భ	■	బ్బి	■	9 తి	10 రు	గు
11 సి	12 పా	యి	■	లి	■	13 ప్ర	లా	పం	■	బ్బు	■
■	ర్థ	■	14 పా	■	15 ఓ	■	లు	■	16 వి	రో	ధి
17 కౌ	డు	18 కు	■	19 శా	ర	20 ద	■	21 అం	■	లు	■
ద	■	22 శు	న	కం	■	23 శ	24 కుం	త	ల	■	25 పు
26 వ	27 రు	డు	■	28 బ	ద్రై	■	29 తి	రం	■	30 బా	ష్పం
■	ద్రా	■	31 క	రి	■	32 ఆ	■	33 గం	34 గ	మ్మ	■
35 అ	క్ష	త	లు	■	36 ఆ	కా	శం	■	త	■	37 మే
38 పా	లు	■	39 పు	40 ర	స్కా	రం	■	41 సు	వా	స	న
ర్థం	■	42 సె	■	43 వ	రం	■	44 పం	జ	రం	■	మా
■	45 ఎ	గ	తా	ళి	■	46 ప	ది	లం	■	47 తే	మ

సుడొకు

8	6	4	3	7	5	2	9	1
9	2	7	6	1	8	5	3	4
5	3	1	2	9	4	6	7	8
7	4	8	5	6	3	1	2	9
3	5	6	1	2	9	4	8	7
1	9	2	4	8	7	3	6	5
4	7	5	8	3	6	9	1	2
2	8	3	9	5	1	7	4	6
6	1	9	7	4	2	8	5	3

A B C D E F 1 2 3
















గాజుముక్కల చమక్కులు!

రంగు రంగుల గాజు ముక్కల్ని తీరుగా అతికిస్తూ ఓ అందమైన రూపాన్ని తెచ్చే మొజాయిక్ ఆర్ట్- ఇంటీరియర్‌లో ఎప్పటికీ సూపర్ ట్రెండే! అదే కళతో తమ సృజనంతా రంగరిస్తూ కొందరు ఆర్టిస్టులు- రమణీయమైన ప్రకృతి దృశ్యాల్నీ, కనువిందు చేసే మనుషుల-జంతువుల చిత్రాల్నీ తయారుచేస్తున్నారు. ఇక్కడున్న ఫొటోలన్నీ అలా తీర్చిదిద్దినవే మరి. కోరుకున్న దృశ్యానికి తగ్గట్టు- విభిన్న రంగుల్లో చిన్న చిన్న గాజు ముక్కల్ని ఎంపిక చేసుకుని, ఒకదాని పక్కన మరొకటి చేర్చుతూ వీటిని సృష్టిస్తున్నారు. చూసిన వారంతా 'రంగుల్లో కుంచెను ముంచి అందాల ప్రకృతికి ఆకృతినివ్వడం చూశాం కానీ... గాజు ముక్కల్ని వాడి, పెయింటింగులకు దీటుగా ఆ అందాల్ని కళ్లకు కట్టడం నిజంగా అద్భుతం' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు!











ULTRA
Perfectly made
సమర్పిస్తున్నాము
భారతదేశపు అత్యంత వేగవంతమైన
1000W మిక్సర్ గ్రైండర్
ChoicePro
1000 W
అత్యంత గట్టిగా ఉండే
పదార్థాలను సెకన్‌లలో
గ్రైండ్ చేస్తుంది
ULTRA SMART.
ULTRA FAST.
ULTRA FINE.
వేగం ముఖ్యమైనప్పుడు, చాయిస్ ప్రో ని ఏదీ ఓడించలేదు
1000W సాటిలేని పవర్‌తో, ఇది అత్యంత గట్టిగా ఉండే
పదార్థాలను భారతదేశంలోని ఏవైనా ఇతర మిక్సర్ గ్రైండర్‌ల
కంటే కూడా వేగంగా గ్రైండ్ చేస్తుంది.
5 YEAR
WARRANTY ON MOTOR
2 YEAR
WARRANTY ON PRODUCT
AISI-304 ఫుడ్-గ్రేడ్
సెర్రేటెడ్ బ్లేడ్
ఖచ్చితత్వంతో కట్ చేస్తుంది.
అల్ట్రా-మన్నిక, ముక్కలవ్వదు
లేదా విరిగిపోదు.
AISI-304
ఫుడ్-గ్రేడ్ జార్స్
తుప్పు నిరోధిస్తుంది.
పరిశుభ్రమైనది మరియు
సుదీర్ఘ కాలమైనది.
హెవీ-డ్యూటీ కప్లర్
భద్రమైన జార్ లాకింగ్
మరియు సర్వోత్తమ
మన్నిక
0.5 లీ జార్‌కి అదనపు
డోమ్ మూత
మీకు అవసరమైనప్పుడు
గ్రైండింగ్ చేయండి
SHOP NOW
amazon | www.elgiultra.com | Available at your nearest stores
ELGI ULTRA PRIVATE LIMITED, No. 1435 (Part), India House, Trichy Road, Coimbatore - 641 018, Tamil Nadu, India.
www.elgiultra.com | Toll Free : 1800 102 2040
Andhra Pradesh : 99084 34477, 88855 52627, 90004 54333, 96409 23777 | Telangana : 91009 82470, 99639 78563, 91009 82460, 86863 19222